

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 19-02-2026 | సంపుటి - 26 | సంచిక -271 | రూ : 4 | పేజీలు: 8

## ఉద్రిక్తంగా మధ్యప్రాచ్యం



2లో

- భారీగా మోహరిస్తున్న అమెరికా సైనిక బలగాలు
- 24 గంటల్లో 50కి పైగా ఫైటర్‌జెట్‌ల తరలింపు
- సముద్ర జలాల్లో కదులుతున్న మరో యుద్ధ విమాన వాహన నౌక



## హరితమే.. తెలంగాణ ఇంధనం

- రాష్ట్రంలో భావి పురోగతి అంతా గ్రీన్ ఎనర్జీతోనే..
- 2034 నాటికి నెట్‌జీరో నగరంగా హైదరాబాద్
- కోర్ అర్బన్ నుంచి పరిశ్రమల తరలింపు..
- నగరమంతటా కాలుష్య నివారణకు చర్యలు
- బయి 'క్లైమేట్ వీక్' సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతాన్ని 2034 నాటికి నెట్‌జీరో నగరంగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్)లో రానున్న ఐదేళ్లలో పరిశ్రమలు ఉండబోవని వెల్లడించారు. హరిత ఇంధనం (గ్రీన్ ఎనర్జీ) తరువాయి 2లో

## నేటి నుంచి రంజాన్ ఉపవాసాలు

- మత సామరస్యానికి ప్రతీక : సీఎం రేవంత్ రెడ్డి



2లో

## ఏఐపై ఏటా అంతర్జాతీయ సదస్సు


- గుటెరస్ వెల్లడి



2లో

## పేదలకు చౌకగా ఔషధాలు

- ఆ లక్ష్యంతోనే పరిశోధన, ఆవిష్కరణలకు పెద్దపీట
- 2030 నాటికి రాష్ట్రంలో లైఫ్ సైన్సెస్ రంగం భారీగా విస్తరణ
- బయో ఆసియా సదస్సు ముగింపు వేదికపై మంత్రి శ్రీధర్‌బాబు



2లో



## ఆధిపత్యం లేదు.. కానీ అజేయమే

- గ్రూప్ దశలో భారత్‌కు అగ్రస్థానం
- నెదర్లాండ్స్‌పై విజయం
- చెలరేగిన దూబె

2లో

## నౌకాదళం.. మన బలం

- దేశ రక్షణలో నేవీది కీలకపాత్ర
- సమైక్యతా స్ఫూర్తికి నిదర్శనం ఐఎఫ్ఆర్
- విశాఖలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- 71 యుద్ధ నౌకల నుంచి గౌరవ వందనం స్వీకరణ

విశాఖపట్నం : దేశ సాగర జలాల భద్రతలోనే కాకుండా విస్తృతమైన సముద్ర రవాణా వ్యవస్థను సురక్షితంగా ఉంచడంలో భారత నేవీ కీలక పాత్ర పోషిస్తోందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. విశాఖ తీరంలో ఇండియన్ నేవీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఇంటర్నేషనల్ తరువాయి 2లో





## సంద్రంలో.. యుద్ధ నౌకల గర్జన

- నౌకాదళాల శక్తి చాటేలా ఐఎఫ్ఆర్
- పాల్గొన్న 66 భారత, 19 విదేశీ యుద్ధ నౌకలు

విశాఖపట్నం: అంతర్జాతీయ యుద్ధ నౌకల సమీక్ష (ఐఎఫ్ఆర్) విశాఖ తీరంలో అబ్బురపరిచేలా సాగింది. 66 భారత, 19 విదేశీ యుద్ధనౌకలు, మూడు జలాంతర్గాములు, 60కిపైగా యుద్ధ విమానాలు పాల్గొన్నాయి. భారత త్రివిధ దళాధిపతి హోదాలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఐఎన్ఎస్ సుమేధలో ప్రయాణిస్తూ ఆరు వరుసల్లో నిలిపిన యుద్ధ నౌకల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. మొదట తూర్పు నౌకాదళ ప్రధాన కార్యాలయం ప్రాంగణానికి చేరుకున్న ఆమె.. నౌకాదళం నుం తరువాయి 2లో



2లో

## భారత్-అమెరికా మధ్య సబ్‌సీ కేబుల్

- విశాఖ గూగుల్ డేటా సెంటర్‌తో అనుసంధానం
- 30 మిలియన్ డాలర్ల ఏఐ సైన్స్ ఇంపాక్ట్ ఛాలెంజ్
- 2 కోట్ల మంది ప్రభుత్వోద్యోగులు.. కోటిమంది విద్యార్థులకు ఏఐలో నైపుణ్య శిక్షణ
- ఏఐ ఇంపాక్ట్ సదస్సులో గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్

# హరితమే తెలంగాణ ఇంధనం

హైదరాబాద్: హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతాన్ని 2034 నాటికి నెట్‌జీరో నగరంగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) లో రానున్న ఐదేళ్లలో పరిశ్రమలు ఉండబోవని వెల్లడించారు. హరిత ఇంధనం (గ్రీన్ ఎనర్జీ) ప్రపంచ పరిరక్షణకు లాభదాయకమని, తెలంగాణలో దానికే ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. మహారాష్ట్ర ప్రభుత్వం ముంబయిలోని బాంద్రా కుర్లా జియో కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన 'క్లైమేట్ వీక్' సదస్సులో రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. వాతావరణ మార్పులు, కొవిడ్ వంటి వాటిని వాతావరణ ఎమర్జెన్సీగా ఆయన అభివర్ణించారు. హైదరాబాద్‌లో వాతావరణ ప్రమాదాలను తగ్గిస్తూ, సురక్షితంగా, వేగంగా అభివృద్ధి చెందే మెట్రోపాలిటన్‌గా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. పట్టణాభివృద్ధిలో భాగంగా కార్బన్ ఫుట్‌ప్రింట్ ఆడిట్ చేపట్టనున్న తొలిభారత నగరంగా హైదరాబాద్ నిలవనుందని చెప్పారు. బొగ్గు వంటి సంప్రదాయ ఇంధన వనరుల నుంచి సోలార్, గ్రీన్ ఎనర్జీవైపు మారడమే తమ ప్రధాన లక్ష్యమని.. కాలుష్య నియంత్రణ, పునర్వినియోగం, స్థిరశక్తి ఉత్పత్తి విధానాలపై నిరంతర పరిశోధనలు కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... "గ్లోబల్ సాఫ్ట్‌వేర్, టెక్ సంస్థలు తమ బ్యాక్ ఆఫీస్ కార్యకలాపాలకు భారత్‌ను ప్రధాన కేంద్రంగా గుర్తించాయి. అందుకే ప్రపంచంలోనే అత్యధిక గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు (జీసీసీలు) మన దేశంలో ఉన్నాయి. సాంకేతిక పురోగతిలో తయారీ రంగం ఎక్కువ అవకాశాలు కోల్పోయింది. కరోనా అనంతరం ప్రభుత్వాల దృష్టికోణం మారింది. ప్రస్తుతం అభివృద్ధి వ్యూహంలో తయారీ రంగం, పర్యావరణ పరిరక్షణ, సుస్థిరత్వం కీలకంగా మారాయి. భవిష్యత్ అభివృద్ధికి ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం, విద్య, నైపుణ్యాలు, వనరులు, ఉపాధి ప్రధాన స్తంభాలుగా నిలుస్తాయి. వ్యూహాత్మక అభివృద్ధిలో భాగంగా రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ జోన్‌లుగా విభజించాం. హైదరాబాద్ చుట్టూ 160 కి.మీ. పొడవైన ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని ప్రాంతం కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్)గా ఉంటుంది. ఓఆర్ఆర్ నుంచి.. ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) మధ్య ప్రాంతాన్ని ప్యూర్ జోన్‌గా ప్రకటించి దీన్ని తయారీ రంగానికి కేటాయించాం. ఈ ప్రాంతాన్ని దేశంలోనే అతిపెద్ద తయారీ కేంద్రంగా అభివృద్ధి చేసి చైనాకు ప్రత్యామ్నాయంగా నిలబెట్టడమే ప్రభుత్వ లక్ష్యం. ఈ అభివృద్ధి అంతా గ్రీన్ ఎనర్జీ ఆధారంగానే కొనసాగుతుంది.

**విద్యుత్తు డిమాండ్ 19 వేల మెగావాట్లు**

రాష్ట్రంలో సగటు విద్యుత్తు వినియోగం పెరుగుతోంది. రోజుకు సగటున 16,610 మెగావాట్ల విద్యుత్తు వినియోగమవుతోంది. గత ఏడాది గరిష్ఠ డిమాండ్ 17,162 మె.వా. ఉంటే.. ఈ ఏడాది 19 వేలకు పెరుగుతుందని అంచనా. 2034 నాటికి గరిష్ఠ డిమాండ్ 34 వేల మెగావాట్లకు చేరుతుంది. ప్రస్తుతం రాష్ట్ర విద్యుదుత్పత్తిలో దాదాపు 25 శాతం గ్రీన్ ఎనర్జీ నుంచి వస్తోంది. తయారీ జోన్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్న పరిశ్రమలు, డేటా సెంటర్లు గ్రీన్‌ఎనర్జీని కోరుకుంటున్నాయి. ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థలోని వనరుల్లో హరిత ఇంధనమే ప్రధానంగా ఉంటుంది. రాష్ట్రంలోని మూడు జోన్లలోనూ కాలుష్య నివారణకు తోడ్పడేలా.. పర్యావరణహిత విధానాలు అవలంబిస్తాం. హైదరాబాద్ క్యూర్ ప్రాంతంలో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ)పై పన్నులు తొలగించాం. పెట్టుబడుల కోసం ముందుకు వచ్చిన ఈవీ తయారీ సంస్థలతో చర్చలు కొనసాగుతున్నాయి. ప్రజా రవాణా వ్యవస్థను పర్యావరణహితంగా మార్చేందుకు 2 లక్షలకు పైగా ఆటోరిక్షాలను రెట్రోఫిట్ చేస్తున్నాం. ఆర్టీసీలో 3,500కి పైగా విద్యుత్ బస్సులను ప్రవేశపెడుతున్నాం. హైదరాబాద్ మెట్రోరైల్ మార్గాన్ని ప్రస్తుత 71 కి.మీ. నుంచి 200 కి.మీ. పైగా విస్తరించే చర్యలు కొనసాగుతున్నాయి. పరిశ్రమలను కోర్ అర్బన్ ప్రాంతం నుంచి పెరి అర్బన్ జోన్‌లకు తరలిస్తున్నాం. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మూసీ నది పునరుద్ధరణ, సరస్సులు, చెరువుల సంరక్షణ, వాటర్ గ్రిడ్, వనరుల నిర్వహణ ప్రణాళికలు రూపొందించాం. హైడ్రాలో పర్యావరణ రక్షణ కోసం ప్రత్యేక పోలీసు దళాన్ని ఏర్పాటు చేశాం" అని తెలిపారు. ఈ సదస్సులో నీతి ఆయోగ్ వైస్‌ఛైర్మన్ సుమన్ బెరీ, కెన్యా ఎంపీ చారిటీ కతంబీ చెప్‌క్వోనీ, స్వనీతి ఇనీషియేటివ్ సీఈవో రిత్విక భట్టాచార్య తదితరులు పాల్గొన్నారు.

**ప్రపంచ నేతలకు ప్రధాని విందులో సీఎం**

ఈనాడు, దిల్లీ: దిల్లీలోని భారతమండపంలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సమిట్ 2026లో పాల్గొనడానికి ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన వివిధ దేశాల ప్రభుత్వ నేతలు, కార్పొరేట్ దిగ్గజాలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం రాత్రి విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఇందుకోసం ఆయన ముంబయి నుంచి బుధవారం సాయంత్రం దిల్లీకి వచ్చారు.

# ఏఐపై ఏటా అంతర్జాతీయ సదస్సు

ఐరాస: ఏఐని నియంత్రించడం ఐరాస పని కాదని, కానీ ఏటా అన్ని దేశాలు, పౌర సమాజాలు, ప్రైవేటు కంపెనీలతో కలిసి అంతర్జాతీయ ఏఐ సదస్సు నిర్వహించాలని నిర్ణయించామని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ ఏఐ నిర్మాణంలో 3 కీలక వ్యవస్థలను గుర్తించామని వెల్లడించారు. అత్యున్నత స్థాయి స్వతంత్ర అంతర్జాతీయ సైంటిఫిక్ ప్యానల్ అని, ఇందులో ప్రపంచం నలుమూలల నుంచి 40 మంది నిపుణులను నియమించామని తెలిపారు. అంతర్జాతీయ సదస్సు ద్వారా ఎవరైనా ఏదైనా అంశంపై చర్చించే అవకాశం లభిస్తుందని వెల్లడించారు. దీనివల్ల ఏకాభిప్రాయ సాధనతోపాటు ఏఐలో అవకాశాలను పెంచడంతోపాటు రిస్కులను తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు. ఏఐకి ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయడంపై తాను చేసిన ప్రతిపాదన ఆమోదం పొందుతుందన్న ఆశాభావాన్ని ఆయన ఓ ఇంటర్వ్యూలో వ్యక్తం చేశారు.

# నౌకాదళం.. మన బలం

విశాఖపట్నం : దేశ సాగర జలాల భద్రతలోనే కాకుండా విస్తృతమైన సముద్ర రవాణా వ్యవస్థను సురక్షితంగా ఉంచడంలో భారత నేవీ కీలక పాత్ర పోషిస్తోందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. విశాఖ తీరంలో ఇండియన్ నేవీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్)లో బుధవారం ఆమె పాల్గొన్నారు. ఐఎన్ఎస్‌సుమేధపై ప్రయాణించి 71 యుద్ధనౌకల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. రాష్ట్రపతి వెంట గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దంపతులు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి తదితరులు ఉన్నారు. అనంతరం వివిధ దేశాల నేవీ అధికారులు, అతిథులను ఉద్దేశించి రాష్ట్రపతి మాట్లాడారు. "దేశాల మధ్య సుహృద్భావ వాతావరణాన్ని పెంపొందించడంలో, ఇతర దేశాల నౌకా దళాలతో భాగస్వామ్యాలు నెలకొల్పడంలో భారత నేవీ కీలక పాత్ర పోషిస్తోంది. భారత్, మిత్ర దేశాల మధ్య ఉన్న ఐకమత్యం, నమ్మకం, పరస్పర గౌరవానికి ఐఎఫ్ఆర్ ఓ నిదర్శనం. తీరం వెంబడి వివిధ దేశాల జెండాలు, నౌకాదళ సిబ్బందితో ఉన్న ఈ యుద్ధ నౌకలను చూస్తుంటే సంతోషంగా ఉంది. ఈ వాతావరణం ఉమ్మడి ఏకాత్మ భావనను ప్రతిబింబిస్తోంది. ఫ్లీట్ రివ్యూలో పాల్గొనడం ద్వారా మన సంబంధాలు మరింత బలోపేతమయ్యాయి. సముద్రాల ద్వారా అందరం కలసికట్టుగా ఉన్నామని ఈ కార్యక్రమం నిరూపించింది. భారత ప్రభుత్వ విధానమైన 'మహాసాగర్' స్ఫూర్తిని ఐఎఫ్ఆర్ మరింత ముందుకు తీసుకెళుతుందని ఆశిస్తున్నా" అని రాష్ట్రపతి పేర్కొన్నారు.

**సముద్రాలతో భారత్‌ది సుదీర్ఘ బంధం**

సముద్రాలతో భారత్‌ది సుదీర్ఘమైన, లోతైన, శతాబ్దాల నాటి బంధమని రాష్ట్రపతి గుర్తుచేశారు. వ్యాపారానికి, దేశాల మధ్య బంధానికి సముద్ర జలాలు మార్గాలని పేర్కొన్నారు. "కళింగ రాజుల పాలనలో ఒడిశా నుంచి నావికులు దక్షిణాసియా దేశాలకు వెళ్లి వ్యాపారాలు చేసేవారు. వారి రాకపోకలను అప్పటి ప్రజలు పండగలా జరుపుకొనేవారు. ఆనాటి సంప్రదాయానికి గుర్తుగా ఏటా కార్తిక పౌర్ణమి నుంచి వారం పాటు ఒడిశాలోని కటక్ ప్రాంత ప్రజలు బాలి జాతర అనే పండగను జరుపుకొంటున్నారు. ప్రస్తుతం ఫ్లీట్ రివ్యూ జరుగుతున్న విశాఖపట్నం.. భారత తూర్పు నౌకా దళ (ఈఎన్‌సీ) కేంద్రం. ఈ నగరానికీ సముద్ర వర్తక చరిత్రలో కీలక స్థానం ఉంది. ఇక్కడ ఐఎఫ్ఆర్‌ను నిర్వహించడం.. ఈ నగరానికి నేవీ ఇస్తున్న ప్రాధాన్యాన్ని నొక్కి చెబుతోంది' అని రాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రపంచ పురోగతి, శ్రేయస్సుకు మార్గాలుగా ఉన్న మహాసముద్రాలను అభివృద్ధి చేయడానికి ఆయా దేశాల నౌకాదళాలు సమష్టిగా సహకరిస్తాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న విదేశీ నౌకాదళాల అధికారులు, సిబ్బందిని దేశ ప్రజల తరఫున ప్రశంసించారు.

# పేదలకు చౌకగా ఔషధాలు

హైదరాబాద్: "ఏఐ, డేటా సెంటర్లకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి మా ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. తక్కువ ఖర్చుతో ఔషధాల అభివృద్ధిని ప్రోత్సహిస్తున్నాం. తద్వారా నిరుపేదలకు చౌకగా ప్రాణాధార మందులను అందించాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం. అందుకే జీవశాస్త్ర రంగంలో పరిశోధన, ఆవిష్కరణలకు పెద్దపీట వేస్తున్నాం" అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. "ప్రతి పౌరుడి ఆరోగ్య ప్రొఫైల్ రూపొందించడం, రాష్ట్రస్థాయి బయోబ్యాంక్ ఏర్పాటు, గ్రామాల వరకూ ఫైబర్ కనెక్టివిటీ కల్పించడం వంటి చర్యలు చేపడుతున్నాం. ఫలితంగా దూరప్రాంతాల్లో ఉన్న ప్రజలు కూడా నగర వైద్యులను తక్షణమే సంప్రదించగలిగేలా డిజిటల్ హెల్త్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నాం" అని మంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో రెండు రోజుల పాటు కొనసాగిన 'బయో ఆసియా 2026' 23వ అంతర్జాతీయ సదస్సు బుధవారం ఘనంగా ముగిసింది. ముగింపు వేడుకల్లో మంత్రి శ్రీధర్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అంతకుముందు 'తెలంగాణ రైజింగ్ 2047: బిల్డింగ్ ఏ వరల్డ్ క్లాస్ లైఫ్ సైన్సెస్ ఎకో సిస్టం' పేరిట నిర్వహించిన చర్చాగోష్ఠిలోనూ మంత్రి మాట్లాడారు. "తెలంగాణకు ఐటీ, లైఫ్ సైన్సెస్ రంగాలు రెండూ ఉండడం ప్రత్యేకత. హైదరాబాద్‌లోని ప్రపంచ స్థాయి పరిశోధన కేంద్రాలు, జీనోమ్‌వ్యాలీ వంటి క్లస్టర్లు రాష్ట్రానికి భారీ ప్రయోజనాలను కలిగిస్తున్నాయి. ఈ రెండు రంగాల కలయిక ద్వారా 2030 నాటికి లైఫ్ సైన్సెస్ రంగాన్ని రాష్ట్రంలో భారీగా విస్తరించడానికి పక్కా ప్రణాళికలు రూపొందించాం" అని మంత్రి స్పష్టం చేశారు.

*** రెండేళ్లలో లైఫ్ సైన్సెస్‌లో లక్ష ఉద్యోగాలు**

శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. "తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ పవర్‌హౌస్‌గా మార్చాలన్నదే మా ప్రభుత్వ సంకల్పం. ఈ రంగంలో కేవలం రెండేళ్లలోనే (డిసెంబరు 2023 జనవరి 2026) రూ.73,360 కోట్ల పెట్టుబడులను ఆకర్షించి.. లక్ష ఉద్యోగాలు సృష్టించాం. దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలనే లక్ష్యంతో.. ప్రజలు, నిపుణుల భాగస్వామ్యంతో 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047'కు శ్రీకారం చుట్టాం. 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలనే లక్ష్య సాధనలో కీలకపాత్ర పోషించేలా లైఫ్ సైన్సెస్ రంగం ఎకో సిస్టంను మరింత బలోపేతం చేసేందుకు సమగ్ర ప్రణాళికలు అమలు చేస్తున్నాం. తెలంగాణ నెక్స్ట్‌జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ(2026 2030), తెలంగాణ లైఫ్ సైన్సెస్ స్కూల్, వన్ బయో ఇంక్యుబేటర్, జీనోమ్ వ్యాలీ విస్తరణ, ఫార్మా విలేజెస్ వంటివి తీసుకొచ్చాం. ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ భాగస్వామ్యం, నైపుణ్యం కలిగిన మానవ వనరుల తయారీకి శ్రీకారం చుట్టాం. రాష్ట్రంలో ప్రస్తుతం రెండువేలకు పైగా లైఫ్ సైన్సెస్ సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి.

# భారత్-అమెరికా మధ్య సబ్‌సీ కేబుల్

అమరావతి: భారత్‌అమెరికా మధ్య ఏఐ కనెక్టివిటీని పెంచేందుకు కొత్త సబ్‌సీ కేబుల్ రూట్‌లు ఏర్పాటు చేయనున్నట్లు గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ పేర్కొన్నారు. దిల్లీలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సమిట్‌కు వచ్చిన ఆయన.. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో 1,000 మెగావాట్ల ఏఐ హబ్ ఏర్పాటు.. అంతర్జాతీయ సబ్‌సీ కేబుల్ గురించి ప్రస్తావించారు. ఇది అందుబాటులోకి వస్తే ఉద్యోగాలు, ఏఐ కటింగ్ ఎడ్జ్ ప్రయోజనాలు భారత్‌లోని ప్రజలు, వ్యాపారులకు అందుతాయని తెలిపారు. దీనివల్ల వచ్చే అవకాశాలను ప్రజలు, విద్యార్థులు వినియోగించుకునేందుకు నైపుణ్య శిక్షణలోనూ పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడించారు. సమిట్‌లో భాగంగా నిర్వహించిన మీడియా ఈవెంట్‌లో ఆయన మాట్లాడుతూ.. 'భారతదేశం ఏఐతో అసాధారణంగా అభివృద్ధి చెందుతుందన్న విశ్వాసం నాకు ఉంది. మేం అందులో భాగస్వాములం కావాలనుకుంటున్నాం. ఏఐ అనేది మన జీవితకాలంలో వచ్చిన అతిపెద్ద మార్పు. భారత్ లాంటి దేశాలకు కొత్త అవకాశాలను సృష్టించే అవకాశం దీనివల్ల ఏర్పడుతుంది. ఆరోగ్యం, విద్య, వాతావరణ రంగాల్లో వచ్చే మార్పుల గురించి తెలుసుకోవడం ఏఐతో సాధ్యం. భారతదేశంలో ఏఐ ఎనేబుల్డ్ వాయిస్, విజువల్ సెర్చ్‌ను ఎక్కువగా వినియోగించడం నేను గుర్తించా. అమెరికాభారత్ మధ్య ఏఐ కనెక్టివిటీ కొత్త సబ్‌సీ కేబుల్ ఏర్పాటుతో మెరుగవుతుంది' అని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు నైపుణ్య శిక్షణ: భారతదేశంలోని విద్యార్థులు, ఉద్యోగులకు పెద్ద ఎత్తున నైపుణ్య శిక్షణ అందించడంపై గూగుల్ సంస్థ దృష్టి సారించిందని పిచాయ్ పేర్కొన్నారు. 'విద్యార్థులు, వృత్తి నిపుణుల కోసం గూగుల్ ఏఐ ప్రొఫెషనల్ సర్టిఫికెట్, కర్మయోగి భారత్ భాగస్వామ్యంతో 18 భాషల్లో.. 800 జిల్లాల్లోని 2 కోట్ల మంది ప్రభుత్వ ఉద్యోగులకు ఏఐలో శిక్షణ.. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లకు జెనరేటివ్ ఏఐ ద్వారా 10వేలకు పైగా పాఠశాలల్లోని 1.10 కోట్ల మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నాం' అని పేర్కొన్నారు. శాస్త్రీయ పరిశోధనల్లో ఏఐని వినియోగించడం ద్వారా వాటిని మరింత వేగవంతం చేసేందుకు గాను 30 మిలియన్ డాలర్లతో ఏఐ ఫర్ సైన్స్ ఇంపాక్ట్ ఛాలెంజ్ ఏర్పాటుచేశామని తెలిపారు. దీని ద్వారా క్వాంటమ్ కంప్యూటింగ్, వాతావరణ మార్పుల్లాంటి రంగాల్లో ఏఐని ఉపయోగించి ఆవిష్కరణలను వేగవంతం చేసేందుకు అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. 'గూగుల్ ఏఐ ఓవర్ వ్యూస్.. సెర్చ్ ఫలితాలు.. ఏఐ జెనరేటెడ్ సమ్మరీల్లాంటివి గత దశాబ్దంలో మేం సాధించిన ఫలితాలు. ఏఐ మోడ్ ఇప్పుడు 35 కొత్త భాషల్లో.. 200 దేశాల్లో అందుబాటులో ఉంది. రాబోయే రోజుల్లో రియల్ టైంలో సెర్చ్ లైవ్‌గా.. వాయిస్, కెమెరాతో పనిచేసే విధానం రాబోతోంది. దీనివల్ల మరింతమంది తమ భాషలో తమకు అవసరమైన అంశాలు సెర్చ్ చేసే అవకాశం వస్తుంది. జెమినై యాప్ ప్రపంచవ్యాప్తంగా వేగంగా వృద్ధి చెందుతోంది. భారత్‌లో 10 భాషల్లో అందుబాటులో ఉంది. గూగుల్ డీప్‌మైండ్, భారత ప్రభుత్వం మధ్య ఒప్పందం కుదిరిందని చెప్పడానికి ఎంతో సంతోషిస్తున్నాను' అని తెలిపారు.

**ఏఐ వినియోగంపై ప్రధానితో చర్చించా**

'ఆరోగ్యం, అన్ని భాషల్లో సమాచారాన్ని విస్తరించడం, స్టార్టప్‌లు, వ్యవసాయం లాంటి రంగాల్లో ఏఐని ఎలా వినియోగించాలనే దానిపై ప్రధాని మోదీతో జరిగిన సమావేశంలో చర్చించాం' అని పిచాయ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# ఉద్రిక్తంగా మధ్యప్రాచ్యం

వాషింగ్టన్ : మధ్యప్రాచ్యంలో అమెరికా తన సైనిక బలగాలను మరింతగా పెంచింది. గత ఇరవై నాలుగు గంటల వ్యవధిలో ఆ ప్రాంతానికి యాభై ఫైటర్ జెట్ విమానాలను పంపింది. ఒక వైపు ఇరాన్ అణు కార్యక్రమంపై జెనీవాలో చర్చలు జరుగుతున్న సమయంలోనే మరో వైపు అగ్రరాజ్యం యుద్ధ సన్నాహాలు చేసుకుంటోంది. మధ్యప్రాచ్యంలో వైమానిక, నౌకా సామర్థ్యాన్ని పెంచేందుకే ఈ చర్య తీసుకున్నామని అమెరికా అధికారులు తెలిపారు. ఎఫ్22, ఎఫ్35, ఎఫ్16 యుద్ధ విమానాలు ఆ ప్రాంతం దిశగా కదులుతున్నాయని స్వతంత్ర ఫ్లయిట్ ట్రాకింగ్ డేటా, సైనిక ఏవియేషన్ మానిటర్స్ చెబుతున్నాయి. వీటితో పాటు యుద్ధ విమానాలకు అవసరమైన ఇంధనాన్ని నింపుకొని కొన్ని ట్యాంకర్లు కూడా ఆ ప్రాంతానికి చేరుకుంటున్నాయి. ఇదంతా చూస్తుంటే అమెరికా దళాలు ఏ క్షణంలో అయినా ఇరాన్‌పై యుద్ధానికి దిగవచ్చునని అర్థమవుతోంది.

# సంద్రంలో యుద్ధ నౌకల గర్జన

విశాఖపట్నం: అంతర్జాతీయ యుద్ధ నౌకల సమీక్ష (ఐఎఫ్ఆర్) విశాఖ తీరంలో అబ్బురపరిచేలా సాగింది. 66 భారత, 19 విదేశీ యుద్ధనౌకలు, మూడు జలాంతర్గాములు, 60కిపైగా యుద్ధ విమానాలు పాల్గొన్నాయి. భారత త్రివిధ దళాధిపతి హోదాలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఐఎన్ఎస్ సుమేధలో ప్రయాణిస్తూ ఆరు వరుసల్లో నిలిపిన యుద్ధ నౌకల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. మొదట తూర్పు నౌకాదళ ప్రధాన కార్యాలయం ప్రాంగణానికి చేరుకున్న ఆమె.. నౌకాదళం నుంచి గార్డ్ ఆఫ్ హానర్ స్వీకరించారు. అనంతరం రాష్ట్రపతి గౌరవార్థం నౌకాదళం 21 తుపాకుల సెల్యూట్‌ను సమర్పించింది.

**గంటన్నరపాటు సమీక్ష**

'యునైటెడ్ త్రూ ఓషన్స్' నినాదంతో భారత యుద్ధ నౌకలు, డోర్నియర్, మిగ్ విమానాలు, ధ్రువ్ హెలికాప్టర్లు తమ పాటవాన్ని ప్రదర్శించాయి. రాష్ట్రపతి ప్రయాణిస్తున్న నౌక మొదట వెళ్లగా దాన్ని అనుసరిస్తూ ఐఎన్ఎస్ సుమిత్ర, సుకన్య వెళ్లాయి. ఆరు వరుసలుగా ఏర్పడిన నౌకలను.. ఐఎన్ఎస్ సుమేధలో రాష్ట్రపతి మూడు సార్లు తిరిగి గంటన్నర పాటు సమీక్షించారు. ఆయా యుద్ధ నౌకలపై నుంచి నావికులు వందనం చేయగా రాష్ట్రపతి అభివాదం చేశారు.

**అబ్బురపరిచిన విన్యాసాలు**

ఐఎఫ్ఆర్‌లో హెలికాప్టర్ నుంచి నావికులు తాడుతో దిగి సముద్ర జలాలను తాకుతూ చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి. మెరైన్ కమాండోలు అత్యంత వేగంతో స్పీడ్ బోట్లపై దూసుకెళుతూ నైపుణ్యం ప్రదర్శించారు. చేతక్ హెలికాప్టర్లు త్రివర్ణ పతాకాలతో గగనతలంలో సందడి చేశాయి. ఐఎన్ఎస్ సంకుల్, సింధు కేసరి, సింధు కీర్తి జలాంతర్గాములు సముద్ర జలాల్లో నుంచి నుంచి ఒక్కసారిగా పైకి లేచి రాష్ట్రపతికి అభివాదం చేశాయి. మిగ్ యుద్ధ విమానాలు గగనతలంలో ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలు ప్రదర్శించాయి. ధ్రువ్, సీ కింగ్, కమోవ్ 31 ఫాల్కన్స్, హాక్ హెలికాప్టర్ల విన్యాసాలు భళా అనిపించాయి. కోస్టుగార్డు పహారా విమానాలు, డోర్నియర్ కైట్స్ ప్రదర్శనగా వెళ్లాయి. ఫ్రాన్స్‌కు చెందిన అట్లాంటిక్2 విమానం ఆకర్షించింది.

# నేటి నుంచి రంజాన్ ఉపవాసాలు

హైదరాబాద్ : పవిత్ర రంజాన్ మాసం నెలవంక బుధవారం కనిపించింది. గురువారం నుంచి ముస్లింలు నెలరోజుల పాటు ఉపవాసాలు చేపట్టనున్నారు. బుధవారం ప్రత్యేక ప్రార్థనలు (తరావీ నమాజ్) చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముస్లిం సోదర సోదరీ మణులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర మాసంలో ముస్లింలు ఆచరించే ఉపవాస దీక్షలు, ప్రార్థనలు ఆధ్యాత్మికతను పెంపొందించడంతో పాటు క్రమశిక్షణను పెంచుతాయన్నారు. లౌకికవాదం, మత సామరస్య పరిరక్షణలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని సీఎం తెలిపారు. ముస్లిం సోదరులు రంజాన్ మాసాన్ని సంతోషంగా జరుపుకుని, అల్లా దీవెనలు పొందాలని ఆకాంక్షించారు.

# ఆధిపత్యం లేదు.. కానీ అజేయమే

అహ్మదాబాద్ : టీ20 ప్రపంచకప్ గ్రూప్ దశను భారత్ అజేయంగా ముగించింది. గ్రూప్ఏ ఆఖరి మ్యాచ్‌లో బుధవారం 17 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌ను ఓడించింది. శివమ్ దూబె (66; 31 బంతుల్లో 4×4, 6×6) మెరవడంతో మొదట భారత్ 6 వికెట్ల నష్టానికి 193 పరుగులు చేసింది. ఆర్యన్ దత్ (2/19), డెలీడ్ (0/28) కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. వాన్ బీక్ 56 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో నెదర్లాండ్స్ 7 వికెట్లకు 176 పరుగులు చేసింది. బాస్ డెలీడ్ (33; 23 బంతుల్లో 3×4, 1×6) టాప్ స్కోరర్. మరో అయిదుగురు బ్యాటర్లు 20పై స్కోర్లు చేశారు. వరుణ్ చక్రవర్తి (3/14), శివమ్ దూబె (2/35) రాణించారు. బుమ్రా (1/17) పొదుపుగా బౌలింగ్ చేశాడు. దూబెకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. పోరాడారు..: భారత్ గెలుపుపై ఏ దశలోనూ సందేహాలు లేకున్నా.. ఛేదనలో నెదర్లాండ్స్ బ్యాటింగ్ ఆకట్టుకుంది. అయితే ఆరంభం నుంచి ఆ జట్టు వెనుకబడే ఉంది. పవర్‌ప్లే ముగిసే సరికి ఆ జట్టు 36/1తో నిలిచింది. ఆ తర్వాత లెవిట్ (24)ను హార్దిక్ ఔట్ చేశాడు. ఆకర్‌మ్యాన్ (23)తో కలిసి డెలీడ్ ఇన్నింగ్స్‌ను నడిపించడంతో 12 ఓవర్లకు నెదర్లాండ్స్ 94/2తో నిలిచింది.

## ఆర్థిక సాయం అందజేత



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం గ్రామ పంచాయతీ వాటర్ మెన్ పెండ్యాల రాములు ఇటీవల మృతి చెందారు. బుధవారం రాములు దశదినకర్మ సందర్భంగా గ్రామ సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాలకవర్గం తరపున రాములు భార్య యాదమ్మకు రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుర్కంటి అనుప రెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ ఆత్మానందమయి అమ్మవారి దివ్య సన్నిధిలో గ్రంథావిష్కరణ మహోత్సవం

* **దేశ విదేశాల నుంచి సాధకుల భారీ హాజరు**



విశాఖపట్నం, ప్రజాస్ఫూర్తి : ప్రపంచ ప్రఖ్యాత ఆధ్యాత్మిక గురువులు పూజ్యులు శ్రీ శ్రీ శ్రీ ఆత్మానందమయి అమ్మవారి దివ్య సన్నిధిలో "భోగ సిద్ధర్ ,. మహావతార్ బాబాజీ సుషుమ్న క్రియా యోగ" గ్రంథావిష్కరణ కార్యక్రమం విశాఖపట్నంలోని గాదిరాజు ప్యాలెస్‌లో అత్యంత వైభవంగా జరిగింది. దివ్య బాబాజీ సుషుమ్న క్రియా యోగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ మహోత్సవాన్ని నిర్వహించారు. దేశ విదేశాల నుండి పెద్ద సంఖ్యలో సాధకులు, భక్తులు హాజరై కార్యక్రమాన్ని ఆధ్యాత్మిక వాతావరణంలో నింపారు. ఈ సందర్భంగా పూజ్యులు ఆత్మానందమయి అమ్మవారు సుషుమ్న క్రియా యోగ సాధనకు సంబంధించిన సూక్ష్మ తత్త్వాలను విశదీకరించారు. అనంతరం అనేక మంది సాధకులకు సుషుమ్న క్రియా యోగ దీక్షను ప్రసాదించారు.

# నైపుణ్యం గల యువ పారిశ్రామిక వేత్తలకు ఋణాలు అందిస్తాం

* **బ్యాంక్ ఆఫ్ ఇండియా డివిజనల్ జనరల్ మేనేజర్ తుషార్ కాంత్ ఝా**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : తయారీరంగంలో, సర్వీసు రంగంలో నూతన పరిశ్రమలు నెలకొల్పుతున్న, నైపుణ్యం గల యువ పారిశ్రామిక వేత్తలకు ఋణాలు అందిస్తామని డివిజినల్ జనరల్ మేనేజర్ తుషార్ కాంత్ ఝా అన్నారు. తెలంగాణ జోనల్ బ్యాంక్ అఫ్ ఇండియా ఆధ్వర్యంలొ సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమల వృద్ధికి పారిశ్రామిక వేత్తలకు వ్యాపార అవగహన సదస్సు బాలానగర్ బ్రాంచ్ ఆఫీస్ లొ బుధవారం సాయంత్రం మేనేజర్ అరుణ్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి డివిజినల్ జనరల్ మేనేజర్ తుషార్ కాంత్ ఝా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు . ఈ సందర్భంగా ప్రముఖ పారిశ్రామిక వేత్త పారిశ్రామిక ప్రతినిధి మనసా టూల్ టెక్ అదినేత ప్రముఖ కవి వాకిటి రామ్ రెడ్డి తొలిసారిగా విచ్చేసిన డివిజినల్ జనరల్ మేనేజర్ కు పుష్పగుచ్ఛం అందించి శాలువతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. అనంతరం డి జి ఎం మాట్లడుతూ రెపోరేటు తగ్గినందున మా బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడ వడ్డీరేట్లు తగ్గినవి అని, ముద్రా లోన్స్ , ఎద్యుకేషన్ లోన్స్ తక్కువ వడ్డీకే ఇస్తున్నామని తెలిపారు. బాలానగర్ బ్రాంచ్ ఏర్పడి దాదాపు యాభై సంవత్సరములు కావస్తున్నదని వినియోగదారుల సహకారంతో గొప్ప పురోగతి సాధిస్తూ మా బ్యాంక్ నుండి ఋణాలు పొందుతూ పారిశ్రామిక స్థలాలు తీసుకుంటున్నారని తెలిపారు . మేనేజర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ ,గృహ ముద్ర ఋణాలు తక్కువ వడ్డి రేట్లకి ఇస్తున్నామని ఎంఎస్ఎంఈ పరిశ్రమలకు మా బ్యాంక్ నుండి ఋణాలు అందిస్తున్నామని ముఖ్యంగా నైపుణ్యం గల నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని కొరారు .రెండువేల రూపాయల పాలసీతో ఇరువై లక్షల డెత్ ఇన్సురెన్సు పాలసీ అందిస్తున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది క్రెడిట్ మేనేజర్ సుధాకర్,సుభాశ్ , సునీత ,సుధా ,అపర్ణ, మురళి ,సాగర్ , రమేష్,రమ తదితరులు పాల్గొన్నారు.

# పురాతన చెట్ల నరికివేత

* **పట్టించుకోని అధికారులు**
* **వార్డు సభ్యురాలి భర్త నిర్వాహకం పై గ్రామస్థుల ఆగ్రహం**





(వికారాబాద్, ప్రజాస్ఫూర్తి) : గ్రామంలో చెట్లను కాపాడాల్సిన బాధ్యత కలిగిన వ్యక్తులే బాధ్యతారహితంగా వ్యవహరించారు. 150 ఏళ్ల నాటి పురాతన చెట్లను కూకటి వేళ్ళతో నరికివేశాడు... ఓ వార్డు సభ్యురాలి భర్త. శంకర్పల్లి మండల పరిధిలోని ప్రొద్దుటూరులో ప్రజలు వారిస్తున్న చెట్లు నరికిన ఘటన చోటు చేసుకుంది. గ్రామ 4వ వార్డు శ్వేత సభ్యురాలి భర్త వినోద్ కుమార్ గ్రామస్తులు వారిస్తున్న చెట్లు నడికే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 150 సంవత్సరాల రావి, మర్రి చెట్లు, చింత చెట్లను అందరూ వారిస్తున్న వినకుండా నరికి వేయడం గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అటవీ శాఖ అధికారులు విషయం తెలిసిన పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు విష్మయానికి గురవుతున్నారు. అకారణంగా పెద్దపెద్ద వృక్షాలను కొట్టి వేయించిన వార్డు సభ్యురాలి భర్తపై కఠిన చర్యలు తీసుకోవాలని నక్క మాణిక్యం, బూర్దుల మల్లేష్ లు డిమాండ్ చేశారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన శిక్ష పడేలా చూస్తామన్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న ఇలాంటి వాళ్లను ఏమనాలని ఇప్పటికైనా గ్రామ పెద్దలు మేల్కొవాలని విజ్ఞప్తి చేశారు. ఉన్నత అధికారులు గ్రామ సర్పంచ్ , జరగబోయే దానికి బాధ్యత వహించాలన్నారు. ఒకపక్క మన ప్రభుత్వం చెట్లను పెంచుమని ప్రోత్సహిస్తుండగా, మరో పక్క అదే చెట్లను నరికి వేస్తూ మనుషుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

## బస్తీలలో బోర్లు వేయించాలని ఎంపీకి వినతి



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని మైసమ్మ నగర్ బస్తిలో రెండు బోర్లు జగద్గిరి నగర్ లో ఒక బోర్ వేయించాలని బుధవారం కుత్బుల్లాపూర్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జెకె శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ ని మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శేఖర్ యాదవ్ మాట్లాడుతూ ప్రజలకు నీటి ఎద్దడి నివారించేందుకు బోర్లు వేయిస్తానని హామీ ఇవ్వడం మా సంతోషానికి అవధులు లేకుండ పోయాయన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి ఎంపీ నిధుల నుంచి వేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జగద్గిరి నగర్ బస్తి అధ్యక్షులు జగన్ ముదిరాజ్, మైసమ్మ నగర్ బస్తి అధ్యక్షులు బసవప్ప, ముత్యాలు , ప్రభాకర్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులే అడ్డంకి..!
# నిర్మాణదారుల నరకయాతన

* **జోన్ల మార్పులతో ఫైళ్లకు బ్రేక్**
* **మూడు కార్పొరేషన్లలో నిలిచిపోయిన టౌన్ ప్లానింగ్ ప్రక్రియ**
* **21 రోజుల్లో అనుమతి నిబంధన కాగితాలకే పరిమితం**
* **ఆదాయం తెచ్చే విభాగానికే నిర్లక్ష్యం**
* **డీలిమిటేషన్ తర్వాత దరఖాస్తుదారుల దిక్కుతోచని పరిస్థితి**



**వంగాల రమేష్**
సీనియర్ కరస్పాండెంట్
+ 919493085665

భవన నిర్మాణ అనుమతులను మెరుపు వేగంతో మంజూరు చేస్తామని ప్రభుత్వం ఘనంగా ప్రకటించినా, నేలమీద పరిస్థితి మాత్రం పూర్తి భిన్నంగా ఉంది. కొత్తగా చేపట్టిన జోన్ల పునర్విభజన, కార్పొరేషన్ విభజన, అధికారుల పనితీరు లోపాల కారణంగా దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. "బిల్డ్ నౌ" సాఫ్ట్వేర్ ప్రవేశపెట్టినప్పటికీ, ఫైళ్ల కదలిక మాత్రం నత్తనడకనే సాగుతోంది.

**జోన్ల మార్పులతో జటిలత**

ఉమ్మడి జీహెచ్ఎంసీని విభజించి మూడు కార్పొరేషన్లుగా మార్చిన తర్వాత టౌన్ ప్లానింగ్ వ్యవస్థ పూర్తిగా గందరగోళంలో పడింది. వార్డుల పునర్విభజన, అనంతరం జోన్ల పునర్విభజనతో ఫైళ్ల మార్పిడి ప్రక్రియ నిలిచిపోయింది. ఒక జోన్ నుంచి మరొక జోన్కు బదిలీ అయిన ఫైళ్లు కొత్త అధికారుల వద్ద పెండింగ్గా పేరుకుపోతున్నాయి. ఉప్పల్, ఎల్బీనగర్, కూకట్పల్లి, కుత్బుల్లాపూర్ ప్రాంతాల్లో దరఖాస్తుదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా, స్పష్టమైన సమాధానం దక్కడం లేదు. కొందరు దరఖాస్తుదారుల ఫైళ్లు అసిస్టెంట్ సిటీ ప్లానర్, సిటీ ప్లానర్ స్థాయిలో పూర్తి అయినప్పటికీ, జోనల్ కమిషనర్ వద్దే నిలిచిపోయిన ఘటనలు ఉన్నాయి.

* **21 రోజులు నిబంధన... నెలలు వాస్తవం**

సిటిజన్ చార్టర్ ప్రకారం భవన నిర్మాణ అనుమతులను 21 పని రోజులలో మంజూరు చేయాలి. పత్రాలు అసంపూర్తిగా ఉంటే తిరస్కరించాలి. కానీ ఇప్పుడు ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా ఫైళ్లను పెండింగ్లో ఉంచడం సాధారణమైపోయింది. కొన్ని జోన్లలో అన్ని పత్రాలు సమర్పించినప్పటికీ, మళ్లీ కొత్త పత్రాలు కోరుతూ దరఖాస్తులను వెనక్కి పంపుతున్నారు.

* **ఆదాయం తెచ్చే విభాగానికే నిర్లక్ష్యం**

మున్సిపల్ కార్పొరేషన్లకు ప్రధాన ఆదాయ వనరులు ఆస్తి పన్ను, భవన నిర్మాణ అనుమతుల ఫీజులే. టౌన్ ప్లానింగ్ విభాగం ద్వారానే జీహెచ్ఎంసీకి సంవత్సరానికి సుమారు రూ.1,200 కోట్ల ఆదాయం సమకూరుతోంది. ప్రభుత్వం ఆదాయం పెంచాలని సూచిస్తున్నప్పటికీ, అదే ఆదాయ వనరుపై ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. సంక్రాంతి తర్వాత నిర్మాణ పనులు ప్రారంభించాలని ప్రణాళికలు సిద్ధం చేసుకున్న నిర్మాణదారులు అధికారుల జాప్యంతో ఆందోళనకు గురవుతున్నారు. శుభముహూర్తాలు మించిపోతున్నాయని, ఖర్చులు పెరుగుతున్నాయని వారు వాపోతున్నారు.

* **అధికారుల సమన్వయ లోపమే మూల కారణం**

కార్పొరేషన్ విభజన తర్వాత సిబ్బంది కేటాయింపు, ఫైళ్ల బదిలీ, కొత్త జోన్ల బాధ్యతల విషయంలో స్పష్టత లేకపోవడం పరిస్థితిని మరింత క్లిష్టం చేసింది. జోనల్ కమిషనర్లు టౌన్ ప్లానింగ్ ఫైళ్లపై సమీక్షలు చేయకపోవడం, సెలవుల కారణంగా ఫైళ్లు మరింత నిలిచిపోవడం సాధారణమైంది. ప్రజలకు సౌలభ్యం కల్పించేందుకు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకొచ్చిన ప్రభుత్వం, అమలులో మాత్రం పర్యవేక్షణలో విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. భవన నిర్మాణ అనుమతుల జాప్యం వల్ల ప్రజలు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు పడుతుండగా, సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని నిర్మాణదారులు కోరుతున్నారు.

# జర్నలిస్టులు సామజిక బాధ్యతతో పనిచేయాలి

* **టీయూడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా మీడియా డైరీ ఆవిష్కరణ సభలో మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి.**







(రంగారెడ్డి జిల్లా, ప్రజాస్ఫూర్తి) : జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో రంగారెడ్డి యూనిట్ పాత్ర ప్రశంసనీయమని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం నాంపల్లి లోని మీడియా అకాడమీ కార్యాలయంలో టీయూడబ్ల్యూజే రూపొందించిన రంగారెడ్డి జిల్లా మీడియా డైరీని రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ, కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సలీమ్, సత్యనారాయణలతో కలిసి ఆవిష్కరించారు. జిల్లా సమగ్ర సమాచారంతో డైరీని రూపొందించిన రంగారెడ్డి జిల్లా శాఖను శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. మీడియా అకాడమీ ద్వారా రంగారెడ్డి జిల్లా జర్నలిస్టులకు శిక్షణ కుడా ఇవ్వటం జరిగిందన్నారు. రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ మాట్లాడుతూ రాష్ట్రం లోనే కాకుండా దేశ వ్యాప్తంగా జర్నలిస్టుల పక్షాన పోరాడే ఏకైక యూనియన్ టీయూడబ్ల్యూజే ఐజేయూ మాత్రమే అని అన్నారు. రంగారెడ్డి జిల్లాలో విద్య, వైద్య పరంగా యూనియన్ చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు. రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ షాబాద్ లో మృతి చెందిన జర్నలిస్ట్ రాములు కుటుంబానికి 8 లక్షల సహాయం అందించటం జరిగిందని తెలిపారు. జిల్లా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎం డి సలీమ్ పాషా మాట్లాడుతూ జిల్లా సమగ్ర సమాచారంతో రంగారెడ్డి జిల్లా మీడియా డైరీ 2026 ను రూపొందించటం జరిగిందన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ సహకారంతో జిల్లా జర్నలిస్టు లకు రెండు రోజుల శిక్షణా తరగతులు విజయవంతంగా పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. అదేవిదంగా రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ సూచనల మేరకు జిల్లా జర్నలిస్టులకు పలు నియోజకవర్గాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించినట్లు, రానున్న రోజుల్లో మిగతా నియోజకవర్గాల్లో కూడా పూర్తి చేస్తామన్నారు.ఈ సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ, కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డీ లను శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొండా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, జాతీయ కౌన్సిల్ సభ్యులు ప్రవీణ్, కార్యవర్గ సభ్యులు, విలేకరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలోని జర్నలిస్టులకు బిగ్ అలర్ట్..
# కమిషనర్ ప్రియాంక కీలక ప్రకటన



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వం కొత్త అక్రిడిటేషన్ కార్డుల (Accreditation Cards)ను జారీ చేయనున్న విషయం తెలిసిందే. జీవో నెం.252 ప్రకారం ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సీహెచ్ ప్రియాంక (CH Priyanka) ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాతో పాటు ఫ్రీలాన్స్, వెటరన్ జర్నలిస్టులు అక్రిడిటేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అర్హులైన జర్నలిస్టులు http://ipr.telangana.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 9 నుంచే దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందని, అక్రిడిటేషన్ల దరఖాస్తు, కార్డుల జారీ ప్రక్రియ నిరంతరంగా (Rolling Basis) కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు. దరఖాస్తు చేసుకునే సమయంలో జర్నలిస్టులకు ఏవైనా సాంకేతిక ఇబ్బందులు ఎదురైతే, వాటి పరిష్కారం కోసం మీడియా రిలేషన్స్ విభాగాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. సందేహాల కొరకు హెల్ప్ లైన్ నంబర్ 9154170881ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆ హెల్ప్‌లైన్ కార్యాలయం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తుందని సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సీహెచ్ ప్రియాంక వెల్లడించారు.

## రెడ్డి లాబ్స్‌పై ఎన్‌హెచ్ఆర్‌సీ సీరియస్..

హైదరాబాద్ : డా. రెడ్డి ల్యాబొరోటరిస్ పై వచ్చిన క్లినికల్ ట్రయల్స్ ఆరోపణలను నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) సీరియస్‌గా తీసుకుంది. అమాయకులపై సరైన అనుమతులు లేకుండా లేదా పూర్తి సమాచారంతో సమ్మతి పొందకుండా క్లినికల్ పరీక్షలు నిర్వహించినట్టు వచ్చిన ఫిర్యాదులపై విచారణ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్‌కు ఎన్‌హెచ్ఆర్‌సీ బుధవారం నోటీసులు జారీ చేసింది. ట్రయల్స్ నిర్వహణలో పాటించాల్సిన నిబంధనలు, నైతిక కమిటీల అనుమతులు, బాధితులకు పరిహారం వంటి అంశాలపై పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశాలలో పేర్కొంది.

# మేం మళ్లీ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ నేతలు వడ్డీతో సహా చెల్లించుకోవాల్సి ఉంటుంది: కేటీఆర్

* మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్టుపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం
* క్యాతన్‌పల్లి మున్సిపాలిటీని కైవసం చేసుకునే కుట్రలో భాగమే ఈ అరెస్ట్ అని ఆరోపణ
* అధికార పార్టీకి కొందరు పోలీసులు తొత్తులుగా మారారని విమర్శ
* సుమన్‌ను బేషరతుగా విడుదల చేయాలని ప్రభుత్వానికి డిమాండ్

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది పూర్తిగా అక్రమ అరెస్ట్ అని, కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న అధికార దుర్వినియోగానికి పరాకాష్ఠ అని ఆయన మండిపడ్డారు. మంచిర్యాల జిల్లాలోని క్యాతన్‌పల్లి మున్సిపాలిటీని అడ్డదారుల్లో కైవసం చేసుకోవాలన్న దుర్మార్గపు ఆలోచనతోనే కాంగ్రెస్ ఈ కుట్రకు తెరలేపిందని కేటీఆర్ తీవ్రంగా ఆరోపించారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం ఇంతటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడటం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం



ఖాయమని, అప్పుడు కాంగ్రెస్ పార్టీ నేతలు చేస్తున్న ఈ దుర్మార్గాలన్నింటికీ వడ్డీతో సహా చెల్లించుకోవాల్సి వస్తుందని కేటీఆర్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నేతలు గుర్తుంచుకుంటే మంచిదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ స్పందిస్తూ... "క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ ఉంది. అయినా సరే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ కలిసి దౌర్జన్యంగా దాన్ని చేజిక్కించుకోవాలని చూస్తున్నారు. ఈ కుట్రలో భాగంగానే సుమన్‌పై అక్రమ కేసులు బనాయించి, ఇవాళ దుర్మార్గంగా అరెస్ట్ చేయించారు. ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలకు వ్యతిరేకంగా క్యాతన్‌పల్లి ప్రజలు సంపూర్ణ బంద్ పాటించి నిరసన తెలిపినా ఈ ప్రభుత్వానికి బుద్ధి రాలేదు" అని విమర్శించారు. కొందరు పోలీసు అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. వారు తమ వైఖరి మార్చుకోకపోతే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అక్రమ కేసులో అరెస్ట్ చేసిన బాల్క సుమన్‌ను ప్రభుత్వం తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ తరపున ఆయన డిమాండ్ చేశారు.

## జైలు నుంచి విడుదలైన 'ఐబొమ్మ' రవి

* పైరసీ కేసులో అరెస్టయిన 'ఐబొమ్మ' రవికి బెయిల్
* చంచల్‌గూడ జైలు నుంచి నేడు విడుదల
* షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన తెలంగాణ హైకోర్టు
* దేశం విడిచి వెళ్లొద్దంటూ కఠిన నిబంధనలు విధింపు
* మూడు నెలల క్రితం రవిని అరెస్ట్ చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు



తెలుగు సినిమా పైరసీకి కేంద్రంగా మారిన 'ఐబొమ్మ' వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమంది రవి నేడు చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యాడు. పైరసీ కేసులో అరెస్టయిన రవికి తెలంగాణ హైకోర్టు మంగళవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయడం తెలిసిందే. తెలుగు సినిమాలను పైరసీ చేస్తూ వెబ్‌సైట్‌లో అక్రమంగా అప్‌లోడ్ చేస్తున్నారన్న ఆరోపణలపై సైబర్ క్రైమ్ పోలీసులు మూడు నెలల క్రితం, గత నవంబరులో రవిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. విదేశాల నుంచి వెబ్‌సైట్‌ను నడుపుతూ, బెట్టింగ్ యాప్‌ల ద్వారా కోట్ల రూపాయలు ఆర్జించినట్లు దర్యాప్తులో పోలీసులు గుర్తించారు. ఈ పైరసీ వల్ల తెలుగు చిత్ర పరిశ్రమకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లినట్లు ఫిర్యాదులు అందాయి. అరెస్ట్ తర్వాత రవి పలుమార్లు బెయిల్ కోసం ప్రయత్నించినా ఫలితం లభించలేదు. చివరకు హైకోర్టును ఆశ్రయించగా, జస్టిస్ కె. సుజాన నేతృత్వంలోని ధర్మాసనం ఆయన పిటిషన్‌పై విచారణ చేపట్టింది. రవి 90 రోజులకు పైగా జైలులో ఉన్నాడని, ఇప్పటికీ చార్జ్‌షీట్ దాఖలు కాలేదని, దర్యాప్తునకు అతడి సహకారం పూర్తయిందన్న అంశాలను పరిగణనలోకి తీసుకుని బెయిల్ మంజూరు చేసింది. అయితే, బెయిల్ ఇచ్చే క్రమంలో కోర్టు పలు కఠిన షరతులు విధించింది. దేశం విడిచి వెళ్లరాదని, పాస్‌పోర్టును కోర్టుకు సమర్పించాలని ఆదేశించింది. ప్రతిరోజూ ఉదయం 11 గంటలకు సీసీఎస్ పోలీసుల ఎదుట హాజరు కావాలని, సాక్షులను ప్రభావితం చేయవద్దని స్పష్టం చేసింది. షరతులు ఉల్లంఘిస్తే బెయిల్‌ను రద్దు చేస్తామని ధర్మాసనం హెచ్చరించింది. రవి విడుదలైన నేపథ్యంలో ఈ కేసు దర్యాప్తు ఎలా ముందుకు సాగుతుందనేది ఆసక్తికరంగా మారింది.

## బాల్క సుమన్‌కు 14 రోజుల రిమాండ్

* బాల్క సుమన్‌కు రిమాండ్
* 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించిన మంచిర్యాల కోర్టు
* సుమన్‌తో పాటు మరో ముగ్గురిని కూడా జైలుకు తరలింపు
* క్యాతనపల్లి మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికల సందర్భంగా జరిగిన ఘటన




మంచిర్యాల జిల్లాలో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసిన ఘటనలకు సంబంధించి బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు మంచిర్యాల మేజిస్ట్రేట్ కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఆయనతో పాటు మరో ముగ్గురికి కూడా కోర్టు రిమాండ్ ఆదేశాలు జారీ చేసింది. మంత్రి వివేక్ వెంకటస్వామి కాన్వాయ్‌పై దాడి, పోలీసుల విధులకు ఆటంకం కలిగించారన్న ఆరోపణలతో మంగళవారం రాత్రి ఆయనపై కేసు నమోదైంది. దాంతో పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపర్చారు. వివరాల్లోకి వెళితే, మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికల సందర్భంగా మంగళవారం ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ఎక్స్ అఫీషియో సభ్యునిగా ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చిన రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ కాన్వాయ్‌ను బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకున్నాయి. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో మంత్రి కాన్వాయ్‌పై రాళ్లదాడి జరిగింది. ఈ ఘటనలో మంత్రి ప్రయాణిస్తున్న కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ దాడికి బాల్క సుమన్ నాయకత్వం వహించారని, పోలీసుల బారికేడ్లను స్వయంగా ఆయనే మంత్రి కాన్వాయ్‌పైకి విసిరారని ఆరోపణలు వచ్చాయి. దీనికి సంబంధించిన వీడియో ఫుటేజీలు కూడా వెలుగులోకి వచ్చాయి. ఈ ఘటనపై మంత్రి వివేక్ తీవ్రంగా స్పందించారు. బాల్క సుమన్ గూండాలతో తనపై హత్యాయత్నం చేయించారని ఆరోపిస్తూ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ పరిణామాల నేపథ్యంలో, పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని, దాడికి పాల్పడ్డారని శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ఫిర్యాదు మేరకు బాల్క సుమన్‌తో పాటు మరికొందరిపై కేసు నమోదు చేశారు. ఈ కేసు ఆధారంగానే ఆయన్ను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. ఈ ఘటనతో మంచిర్యాల జిల్లాలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. గొడవల కారణంగా క్యాతనపల్లి మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికను అధికారులు వాయిదా వేశారు.

## బుర్ఖా ధరించి బస్సులో మహిళల పక్కన కూర్చున్న వ్యక్తి.. కోరుట్లలో ఘటన

* ఫిర్యాదు చేయడంతో అదుపులోకి తీసుకున్న పోలీసులు
* రీల్స్ కోసం బుర్ఖా ధరించినట్లు తెలిపిన యువకుడు

తెలంగాణ రాష్ట్రం, జగిత్యాల జిల్లా, కోరుట్లలో ఒక యువకుడు రీల్స్ కోసం బుర్ఖా వేసుకుని బస్సు ఎక్కడం కలకలం రేపింది. యువకుడు బుర్ఖా వేసుకుని బస్సులో కూర్చుని ఫోన్ మాట్లాడుతున్నాడు. బుర్ఖాలోని వ్యక్తిది మగ గొంతుగా గుర్తించిన ప్రయాణికులు ఆర్టీసీ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. బస్ స్టేషన్ వద్దకు చేరుకున్న పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకున్నారు.




తాను రీల్స్ కోసం బుర్ఖా ధరించానని ఆ యువకుడు వెల్లడించాడు. బుర్ఖా ధరించిన వ్యక్తి మహిళల పక్కన కూర్చున్నాడు. దీంతో ఆడవాళ్ల పక్కన కూర్చోవడానికి బుర్ఖా ధరించావా అంటూ పోలీసులు అతడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటిన బీసీలు!

* తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో 61 శాతానికి పైగా సీట్లు గెలుచుకున్న బీసీలు
* రిజర్వేషన్లను మించి జనరల్ స్థానాల్లోనూ బీసీ అభ్యర్థుల భారీ విజయం
* ఇది బీసీల రాజకీయ చైతన్యానికి నిదర్శనమని బీసీ కమిషన్ హర్షం
* 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని కేంద్రానికి కమిషన్ విజ్ఞప్తి



తెలంగాణలో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలు (బీసీలు) అద్భుతమైన విజయాన్ని నమోదు చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా 61 శాతానికి పైగా వార్డులు, డివిజన్లను బీసీ అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. వాస్తవానికి మున్సిపాలిటీల్లో బీసీలకు 28.22 శాతం, కార్పొరేషన్లలో 35.25 శాతం సీట్లు మాత్రమే రిజర్వ్ చేయగా, రిజర్వేషన్లను మించి జనరల్ స్థానాల్లోనూ వారు గెలుపొందడం విశేషం. ఈ ఫలితాలపై బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్‌తో పాటు సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, రంగూ బాలలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు. బీసీ వర్గాల్లో పెరిగిన రాజకీయ చైతన్యానికి ఈ విజయాలే స్పష్టమైన నిదర్శనమని వారు అభిప్రాయపడ్డారు. ఫిబ్రవరి 11న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు జరగ్గా, 13న ఫలితాలు వెలువడిన సంగతి తెలిసిందే. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లోనూ బీసీ అభ్యర్థులు 52.75 శాతం సీట్లు గెలుచుకున్నారని కమిషన్ గుర్తుచేసింది. ఇదే స్ఫూర్తితో త్వరలో జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ, జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ బీసీలు భారీ సంఖ్యలో గెలుపొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర జనాభాలో బీసీలు 56.33 శాతం ఉన్నారని, వారికి 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర అసెంబ్లీ చేసిన చట్టం కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉందని కమిషన్ పేర్కొంది. ఈ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ కొందరు కోర్టులను ఆశ్రయించారని తెలిపింది. తాజా ఎన్నికల ఫలితాల నేపథ్యంలో, 42 శాతం రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చి వెంటనే ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని బీసీ కమిషన్ కోరింది. అలాగే, కోర్టుల్లో కేసులు వేసిన వారు వాటిని ఉపసంహరించుకుని బీసీల అభ్యున్నతికి సహకరించాలని విజ్ఞప్తి చేసింది.




## ఇబ్రహీంపట్నం ఛైర్మన్ ఎన్నికపై హైకోర్టు కీలక ఆదేశాలు

* ఛైర్మన్ ఎన్నికపై తుది నిర్ణయం ఆర్వోదేనని స్పష్టీకరణ
* ఆకుల యాదగిరిపై ఒత్తిడి తీసుకు రావొద్దని కలెక్టర్, పోలీసులకు ఆదేశం
* హైకోర్టు నిర్ణయంతో ఇబ్రహీంపట్నం ఛైర్మన్ ఎన్నికకు తొలగిన అడ్డంకి

ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికకు అడ్డంకి తొలగింది. ఛైర్‌పర్సన్ ఎన్నికకు సంబంధించి స్టేను తెలంగాణ హైకోర్టు ఎత్తివేసింది. ఛైర్మన్ ఎన్నికపై తుది నిర్ణయం రిటర్నింగ్ అధికారి (ఆర్వో) దేనని హైకోర్టు స్పష్టం చేసింది. 16వ వార్డు కౌన్సిలర్‌గా గెలుపొందిన ఆకుల యాదగిరిపై ఎలాంటి ఒత్తిడి తీసుకురావొద్దని జిల్లా కలెక్టర్, పోలీసులను ఆదేశించింది. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 16వ వార్డు నుంచి గెలిచిన తన తండ్రి యాదగిరి అదృశ్యమయ్యారంటూ కుమారుడు హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు ఈరోజు విచారణ జరిపింది. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు యాదగిరిని హైకోర్టులో ప్రవేశపెట్టారు. ఈ నేపథ్యంలో ఇబ్రహీంపట్నం ఛైర్మన్ ఎన్నికలపై హైకోర్టు పోలీసులకు కీలక ఆదేశాలు జారీ చేసింది.

**తనను బలవంతంగా తీసుకెళ్లారు: యాదగిరి**

మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడగానే తనను బలవంతంగా చీరాలకు తీసుకువెళ్లారని యాదగిరి కోర్టుకు తెలిపారు. తనను రెండు రోజుల పాటు బలవంతంగా రిసార్టులో ఉంచారని అన్నారు. హైదరాబాద్‌లో 12 గంటల పాటు కారులో తిప్పారని కోర్టు దష్టికి తీసుకువెళ్లారు. హైకోర్టు ఉత్తర్వులతో తాను నిన్న కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యానని అన్నారు.

## ఘనంగా ప్రారంభమైన 4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్ 2026

రాష్ట్ర పోలీస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026" శుక్రవారం సైబరాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం సైబరాబాద్ సీపీ ఎం రమేష్ ఆధ్వర్యంలో క్రీడా జ్యోతిని డీజీపీ వెలిగించి పోటీలను అధికారికంగా ప్రారంభించారు. పోలీస్ లాంఛనాల మధ్య గన్ ఫైర్ చేసి, గాలిలోకి బెలూన్లు ఎగురవేసి పోటీలకు శ్రీకారం చుట్టారు. డీజీపీ బి. శివధర్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో గ్లోబల్ సమ్మిట్, అంతర్జాతీయ ఫుట్‌బాల్ మ్యాచ్‌లు, గ్రామపంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు, సమ్మక్క సారక్క జాతర వంటి కీలక బాధ్యతలను పోలీసులు సమర్థవంతంగా నిర్వహించారని కొనియాడారు. శాంతిభద్రతల పరిరక్షణలో బిజీగా ఉన్నప్పటికీ క్రీడల్లో పాల్గొనడం సిబ్బందిలో నూతనోత్సాహాన్ని నింపుతుందని పేర్కొన్నారు. క్రీడలు నాయకత్వ లక్షణాలు, టీమ్ స్పిరిట్, ఐకమత్యాన్ని పెంచుతాయని, గెలుపోటముల కంటే క్రీడాస్ఫూర్తి ముఖ్యమని స్పష్టం చేశారు. మహిళా పోలీసుల ప్రాతినిధ్యం ప్రతి విభాగంలో పెరగాలని పిలుపునిచ్చారు. సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల నుంచి 2,532 మంది క్రీడాకారులు పాల్గొనడం గర్వకారణమన్నారు. ఇందులో 300 మంది మహిళా క్రీడాకారులు ఉండటం విశేషమన్నారు. మొత్తం 31 క్రీడా విభాగాల్లో పోటీలు జరుగుతున్నాయని, మహిళలకు 14 ఈవెంట్స్ కేటాయించామని తెలిపారు. జాతీయ స్థాయి విజేతలకు గోల్డ్‌కు రూ.3 లక్షలు, సిల్వర్‌కు రూ.2 లక్షలు, బ్రాంజ్‌కు రూ.1 లక్ష నగదు ప్రోత్సాహకంతో పాటు ఇంక్రిమెంట్లు అందజేస్తున్నట్లు వెల్లడించారు. క్రీడలపై ముఖ్యమంత్రి ఉన్న ప్రోత్సాహంతో మహ్మద్ సిరాజ్, నిఖత్ జరీన్ వంటి క్రీడాకారులను నేరుగా డీఎస్పీలుగా నియమించడం శాఖకు గర్వకారణమన్నారు. అనంతరం అంతర్జాతీయ వేదికలపై రాణించిన పి. కృష్ణారావు, డి. సంజీవ్ కుమార్, గోపాల్ కృష్ణ, ఎం.డి. బాబా, అవెను గోపాల్, ఎస్. జయరాం (అర్జున అవార్డు గ్రహీత), కె. లావణ్యలను పతకాలతో సన్మానించారు.

**ప్రత్యేక ఆకర్షణగా పోలీస్ ఎక్స్ పో..**

ఈ క్రీడా పోటీలను పురస్కరించుకొని పోలీస్ వెల్ఫేర్ అండ్ వెల్నెస్ లో భాగంగా సైబరాబాద్ కమీషనరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎక్స్ పో ని తెలంగాణ రాష్ట్ర డీజీపీ సతీమణి హేమ శివధర్ రెడ్డి ప్రారంభించారు.



పోలీసులకు ఉపయోగపడే.. ఆరోగ్య సంరక్షణ, పౌష్టికాహారం, శారీరక వ్యాయామ, క్రీడా పరికరాలు, వివిధ ఉత్పత్తుల స్టాల్స్ ను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన పట్ల పోలీస్ సిబ్బంది, క్రీడాభిమానులు, సందర్శకులు విశేష ఆసక్తి కనబరుస్తున్నారు. జైళ్ల శాఖ ఏర్పాటు చేసిన ఉత్పత్తులు ప్రత్యేక ఆకర్షణ గా నిలుస్తోంది. ఖైదీలు ఏర్పాటు చేసిన డోర్ మ్యాట్ లు, ఫ్లోర్ క్లీనర్ లు, టవల్స్, బెడ్ షీట్లు, కలపతో తయారు చేసిన హస్త కళాకృతులు, నిత్యజీవితంలో రోజువారీ ఉపయోగించే వస్తువులు కుర్చీలు, మొబైల్ స్టాండ్లు, మహిళా ఖైదీలు తయారుచేసిన సరికొత్త డిజైన్ గాజులు, బ్యాగులు తదితర వస్తువులు స్టాల్లో కొలువయ్యాయి.

## నర్సులకు కనీస వేతనం రూ.20వేలు అమలు చేయాలి: కల్వకుంట్ల కవిత

క్రెడిట్ పాయింట్ల పేరుతో నర్సింగ్ సిబ్బందిని వేధింపులకు గురిచేయొద్దని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. క్వాలిఫైడ్ నర్సుల రిజిస్ట్రేషన్ రెన్యూవల్‌కు ఐదేళ్లలో 150 క్రెడిట్ పాయింట్లు సాధించి ఉండాలని కొర్రీలు పెట్టడం సరికాదని పేర్కొన్నారు. ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ ఈ నిబంధనలు తెచ్చిన తర్వాత తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్ వాటిపై కనీస అవగాహన కల్పించే ప్రయత్నాలు చేయలేదని గుర్తుచేశారు. తెలంగాణ నర్సింగ్



కౌన్సిల్ నిర్లక్ష్యంతో రాష్ట్రంలో 80వేల మంది నర్సింగ్ సిబ్బంది తమ రిజిస్ట్రేషన్ల రెన్యూవల్‌కు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. క్వాలిఫైడ్ నర్సులు తమ నైపుణ్యాలను మెరుగు పరుచుకోవడానికి ఐదేళ్లలో 150 గంటల కంటిన్యూయింగ్ నర్సింగ్ ఎడ్యుకేషన్ క్రెడిట్ అవర్స్ కలిగి ఉండాలనే నిబంధన తెచ్చినట్టు చాలా మందికి అవగాహన లేదని తెలిపారు. ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ తెచ్చిన ఈ కొత్త నిబంధనపై తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్ అవగాహన కల్పించలేదని నర్సింగ్ సిబ్బంది వాపోయారని తెలిపారు. 150 రిజిస్ట్రేషన్లు రెన్యూవల్ చేస్తామంటూ తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్ ఉత్తర్వులు ఇవ్వడం పూర్తిగా ఏకపక్షమేనని పేర్కొన్నారు. ఉద్యోగాలు చేస్తూ నర్సింగ్ సిబ్బంది నెలకు కనీసం రెండు కాన్ఫరెన్స్‌లకు హాజరయితే తప్ప నర్సింగ్ కౌన్సిల్ నిబంధనల మేరకు క్రెడిట్ పాయింట్స్ సాధించడం సాధ్యం కాదని పేర్కొన్నారు. ఈ విధానంపై పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. అలాగే.. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న నర్సులకు కనీస వేతనం రూ.20 వేలు అమలు చేస్తూ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. నర్సింగ్ సిబ్బందిపై వేధింపులు ఆపకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## రేపటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

హైదరాబాద్: రంజాన్ నెలవంక భారత్‌లో ఇవాళ కనిపించింది. దీంతో రేపటి (గురువారం) నుంచి పవిత్ర రంజాన్ మాసం ఉపవాస దీక్షలు ప్రారంభం కానున్నాయి. మొత్తం నెల పాటు ప్రత్యేక నమాజ్‌లు జరగనున్నాయి.



# గతేడాది.. కెనడా నుంచి 2800 మంది భారతీయులు వెనక్కి!

అక్రమ వలసలను తీవ్రంగా పరిగణిస్తున్న పలు దేశాలు భారీ సంఖ్యలో ప్రవాసులను వెనక్కి పంపిస్తున్నాయి. ఈ క్రమంలో కెనడా గతేడాది దాదాపు 18వేల మంది విదేశీయులను తిప్పి పంపగా.. అందులో సుమారు 2800 మంది భారతీయులు ఉన్నట్లు వెల్లడైంది. జాతీయ భద్రతకు ముప్పు, మానవ హక్కుల ఉల్లంఘన, వ్యవస్థీకృత నేరాలు, శరణార్థి నిబంధనల ఉల్లంఘన తదితర కారణాలతో వీరిపై చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి కెనడియన్ బోర్డర్ సర్వీసెస్ ఏజెన్సీ ఇటీవల వివరాలు వెల్లడించింది. సరైన పత్రాలు లేకపోవడం, క్రిమినల్ కేసులు, వీసా ఉల్లంఘనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్న కెనడా.. ఏటా వేలాది మందిని వెనక్కి పంపిస్తోంది. ఈ క్రమంలో గతేడాది తొలి పది నెలల వ్యవధిలో మొత్తంగా దాదాపు 18,785 మందిని దేశం నుంచి పంపించింది. మరో 29,542 మందిని వెనక్కి పంపించే ప్రక్రియ కొనసాగుతున్నట్లు కెనడియన్ బోర్డర్ సర్వీసెస్ ఏజెన్సీ నివేదిక వెల్లడించింది. ఇప్పటివరకు తిప్పిపంపిన వారిలో 3972 మంది మెక్సికన్లు ఉండగా.. 2800 మంది భారతీయులు ఉన్నారు. తదుపరి జాబితాలో ఆరు వేలకు పైగా భారతీయులు ఉన్నట్లు సమాచారం. కెనడాలో స్థానిక చట్టాలను అతిక్రమించిన విదేశీయులను వారి స్వదేశానికి తిప్పి పంపేందుకు తీవ్రతను బట్టి మూడు రకాల ఆర్డర్లు ఇస్తారు. డిపార్చర్ (స్వల్ప తీవ్రత ఉన్న ఆదేశాలు), ఎక్స్‌క్లూజన్ (ఏడాది నుంచి ఐదేళ్ల పాటు నిషేధం ముప్పు ఉండే), డిపోర్టేషన్ (దేశంలోకి మళ్లీ తిరిగి రాకుండా పూర్తి నిషేధం ముప్పు ఉండే ఆదేశాలు)లను జారీ చేస్తుంటారు. డిపార్చర్ ఆర్డర్లు అందుకున్న వారు 30 రోజుల్లోనే దేశం నుంచి వెళ్లిపోవాలి. లేదంటే డిపోర్టేషన్ ఆర్డర్ జారీ అవుతుంది.




## అందుకే కొన్నిచోట్ల హిందీపై వ్యతిరేకత..!: కేరళ గవర్నర్


దేశంలోని కొన్ని ప్రాంతాల్లో, ముఖ్యంగా దక్షిణాదిలో హిందీపై వ్యతిరేకత అనేది.. ఆ భాషలో ఉర్దూ, పర్షియన్ పదాలు ఉండటం వల్లే కావొచ్చని కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ అన్నారు. సంస్కృతం ఆధారిత పదజాలాన్ని వినియోగించడం ద్వారా ఈ సమస్యకు పరిష్కారం చూపొచ్చని తెలిపారు. కేరళలోని తిరువనంతపురంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ మేరకు ప్రసంగించారు. "భాషపైన వ్యతిరేకత కంటే అందులోని పదజాలానికి సంబంధించిన అడ్డంకులే హిందీ మాట్లాడకపోవడానికి ఎక్కువగా



కారణమవుతున్నాయి. ప్రస్తుతం హిందీలో ఉపయోగిస్తున్న అనేక పదాలు ఉర్దూ, పర్షియన్ నుంచి తీసుకున్నవే. దీంతో దక్షిణాది భాషలు మాట్లాడేవారికి హిందీ విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయేమో! హిందీలో మాట్లాడేటప్పుడు సంస్కృతం నుంచి పుట్టిన పదాలను ఎక్కువగా వాడితే.. దక్షిణాదిలోని చాలామంది అర్థం చేసుకోగలరు" అని గవర్నర్ అర్లేకర్ అన్నారు. "సంస్కృతంతో ముడిపడి అనేక భారతీయ భాషల మధ్య చారిత్రక, సాంస్కృతిక సంబంధాలు ఉన్నాయి. అవి భాషాపరమైన అంతరాలను తగ్గించేందుకు దోహదపడతాయి. భాషల మధ్య వ్యత్యాసాలను ఎత్తిచూపే బదులు వాటి మధ్య సంబంధాలను గుర్తించడం, పరస్పర అవగాహనను పెంపొందించడంపై భాషాపండితులు, పరిశోధకులు దృష్టి సారించాలి. సమ్మిళిత, ఐకమత్య దేశాన్ని నిర్మించేందుకు ఒకరి భాషను మరొకరు అర్థం చేసుకోవడం చాలా అవసరం" అని తెలిపారు.


## క్షమించండి.. మా ప్రతినిధిది అత్యుత్సాహమే!..: గల్గోటియాస్

ఏఐ ఇంపాక్ట్ సదస్సులో ఓ చైనీస్ రోబోడాగ్‌ను సొంత ఆవిష్కరణగా ప్రకటించుకుని గల్గోటియాస్ యూనివర్సిటీ విమర్శలపాలైన విషయం తెలిసిందే. ఈ వివాదంపై వర్సిటీ తాజాగా క్షమాపణలు చెప్పింది. ఆ రోబోడాగ్ సాంకేతిక మూలాల గురించి తమ ప్రతినిధికి తెలియదని, కెమెరా ముందు అత్యుత్సాహంతో తప్పుడు సమాచారాన్ని అందించారని ఓ ప్రకటనలో తెలిపింది. మరోవైపు.. ఈ వ్యవహారంపై కేంద్రం స్పందించింది. ఎగ్జిబిటర్లు తమది కాని ఆవిష్కరణలను ప్రదర్శనలో ఉంచకూడదని, అంతర్జాతీయ వేదికపై ఇటువంటివి కొనసాగాలని కోరుకోవడం లేదని



హెచ్చరించింది. "మాకు వివాదాలు వద్దు. కాబట్టి.. సదస్సులో ఇటువంటి వివాదాస్పద ఏజెన్సీలు అవసరం లేదు. ఎగ్జిబిటర్లు తమ నిజమైన ఆవిష్కరణలను ప్రదర్శించాలి. కాపీరైట్ ఉల్లంఘనలు, తప్పుదోవ పట్టించే అంశాలను ప్రోత్సహించేది లేదు. ఇటువంటివాటికి ఏఐ సదస్సులో చోటులేదు. కచ్చితంగా నియమాలను పాటించాల్సిందే. ఇటువంటి పనుల వల్ల.. ఇతర ఎగ్జిబిటర్లపై ప్రభావం పడటం ఇష్టం లేదు" అని ఎలక్ట్రానిక్స్, ఐటీశాఖ కార్యదర్శి ఎస్.కృష్ణన్ వ్యాఖ్యానించారు. అదనపు కార్యదర్శి అభిషేక్ సింగ్ మాట్లాడుతూ.. ఆవిష్కరణలను అణచివేయడం తమ ఉద్దేశం కాదని చెప్పారు. కానీ, అవి ప్రజలను తప్పుదోవ పట్టించకూడదన్నారు. గ్రేటర్ నోయిడాకు చెందిన గల్గోటియాస్ వర్సిటీ ఈ వ్యవహారంపై ఇప్పటికే ఓసారి వివరణ ఇచ్చింది. ఆ రోబోడాగ్‌ను చైనా (China) సంస్థ నుంచే కొనుగోలు చేశామని, విద్యార్థులు నేర్చుకోవడానికి ఒక సాధనంగా వాడుతున్నామని చెప్పింది. అయితే.. సదస్సుకు హాజరైన ఆ వర్సిటీ మహిళా ప్రతినిధి ఒకరు దానిని తామే అభివృద్ధి చేశామని చెప్పడం గమనార్హం. దీంతో మరోసారి స్పందించిన యాజమాన్యం.. ఆ ప్రతినిధికి రోబోడాగ్‌పై సరైన సమాచారం లేదని తెలిపింది. నిజాయతీ, పారదర్శకతకు కట్టుబడి ఉన్నామని పేర్కొంది. సదస్సు నిర్వాహకుల మనోభావాలను అర్థం చేసుకుని ప్రాంగణాన్ని ఖాళీ చేసినట్లు చెప్పింది.

## హిమంత బిశ్వశర్మ 'అస్సాం జిన్నా': గౌరవ్ గొగొయ్



అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మను ఉద్దేశిస్తూ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు గౌరవ్ గొగొయ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. హిమంతను 'అస్సాం జిన్నా'గా ఆరోపించారు. భాజపాలో చేరేవారంతా వారి రాజకీయ జీవితంలో ప్రాధాన్యం లేనివారిగా మిగిలిపోతారంటూ విమర్శలు చేశారు. గువాహటిలో గొగొయ్ విలేకరులతో మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర మాజీ కాంగ్రెస్ చీఫ్ భూపెన్ కుమార్ బోరా రాజీనామా పత్రంపై తీవ్ర చర్చ జరిగిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆయన భాజపాలో చేరనున్నట్లు ప్రచారం జరిగింది. దీనిపై గొగొయ్ మాట్లాడుతూ.. కమలంలో చేరితే బోరా కూడా ప్రాధాన్యం లేని రాజకీయ నాయకుడిగా మిగిలిపోతారన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో నిజమైన పోరాటం కాంగ్రెస్.. పాత కాంగ్రెస్ (పార్టీని వీడిన వారి) మధ్య ఉంటుందని వ్యాఖ్యానించారు. భాజపాలో అనేక మంది మాజీ కాంగ్రెస్ నాయకులు ఉన్నారని.. వారంతా రాష్ట్రంలో అవినీతిపరులని ఆరోపించారు. ఈ సందర్భంగా సీఎం హిమంత బిశ్వ శర్మ పై తీవ్ర విమర్శలు చేశారు. బోరా కాంగ్రెస్‌ను వీడటం వల్ల.. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీపై ఎలాంటి ప్రభావం ఉండదని వ్యాఖ్యానించారు.

## దుస్తులను లాగడమూ అత్యాచార యత్నమే: సుప్రీంకోర్టు

దిల్లీ: మహిళ దుస్తులను పట్టుకొని లాగటం, వక్షోజాలను తాకడం అత్యాచారం కిందకు రాదంటూ అలహాబాద్ హైకోర్టు జడ్జి ఇచ్చిన తీర్పు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. దీనిపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ జరిపింది.

**అసలేం జరిగిందంటే..?**


2021 నవంబరులో ఉత్తర్‌ప్రదేశ్‌లోని కస్‌గంజ్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ, తన 11 ఏళ్ల (ఘటన జరిగే నాటికి) కుమార్తెతో కలిసి బంధువుల ఇంటి నుంచి తిరిగి వస్తుండగా అదే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు వారిని సమీపించి బాలికను ఇంటి దగ్గర దింపుతామని ద్విచక్ర వాహనంపై ఎక్కించుకున్నారు. మార్గమధ్యంలో అమ్మాయిని అసభ్యంగా తాకుతూ కల్వర్టు కిందకు తీసుకువెళ్లేందుకు ప్రయత్నించారు.



బాలిక అరుపులు విని అటుగా వెళ్తున్నవారు రావడంతో నిందితులు అక్కడినుంచి పరారయ్యారు. ఈ కేసుపై గతేడాది అలహాబాద్ హైకోర్టు జడ్జి ఇచ్చిన తీర్పు వివాదాస్పదమైంది. మహిళ వక్షోజాలను తాకడం, దుస్తులు పట్టుకొని లాగినంత మాత్రాన అత్యాచారం కిందకు రాదంటూ కేసును కొట్టివేశారు. ఇలాంటి తీర్పుతో సమాజంలోకి తప్పుడు సందేశం వెళ్లే అవకాశం ఉందని, సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని అభ్యర్థనలు వచ్చాయి. ఆ కేసును సుప్రీంకోర్టు సుమోటోగా విచారణకు తీసుకుంది. హైకోర్టు న్యాయమూర్తి వ్యాఖ్యలు ఏమాత్రం సున్నితమైనవి కావని, అమానవీయంగా ఉన్నాయని గత విచారణలో విచారం వ్యక్తంచేసింది. ఆ జడ్జి ఇచ్చిన తీర్పుపై స్టే విధించింది. ఈ నేపథ్యంలోనే తాజా తీర్పు వెలువడింది. నిందితుల చర్యలు అత్యాచారం కిందకే వస్తాయని స్పష్టం చేసిన అత్యున్నత న్యాయస్థానం.. హైకోర్టు వ్యాఖ్యలతో ఏకీభవించలేమని పేర్కొంది. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టేసింది.

## ఉద్యోగులకు సర్‌ప్రైజ్.. రూ.20 కోట్లతో కాస్ట్లీ కార్లు గిఫ్ట్..!

తమ సంస్థ అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించిన ఉద్యోగులకు ఓ కంపెనీ అదిరిపోయే సర్‌ప్రైజ్ ఇచ్చింది. ఏకంగా రూ.20 కోట్లు ఖర్చు చేసి ఖరీదైన కార్లను బహుమతిగా ఇచ్చింది. కంపెనీ ప్రారంభించి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేరళలోని హైలైట్ గ్రూప్ ఈ కానుకలు అందజేసింది. రిటైల్ స్పేస్ రంగంలో రాష్ట్రంలో అగ్రగామిగా ఉన్న హైలైట్ గ్రూప్‌ను 1996లో స్థాపించారు. ఇటీవల ఈ కంపెనీ 30 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా కాలికట్‌లో నిర్వహించిన వేడుకల్లో కంపెనీకి చెందిన ఉద్యోగులకు ఈ ఖరీదైన బహుమతులను అందజేశారు. సంస్థ ప్రారంభం నుంచి సేవలందించిన 47 మందికి



రూ.20 కోట్ల విలువైన కార్లను పంపిణీ చేశారు. వీటిలో రేంజ్ రోవర్, ఆడీ క్యూ8, లాండ్ రోవర్ డిఫెండర్, టాటా హారియర్, కియా సెల్టోస్, హ్యుందాయ్ క్రెటా, స్కోడా కైలాక్ వంటి మోడళ్లు ఉన్నాయి. దీంతోపాటు 2030 నాటికి తమ సంస్థను మరింత విస్తరించి 2 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హైలైట్ గ్రూప్ కంపెనీ యాజమాన్యం వెల్లడించింది. ఈ సంస్థకు త్రిశూర్, కాలికట్‌లలో లగ్జరీ మాల్స్ ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా మరో 10 మాల్స్ అభివృద్ధి దశలో ఉన్నాయి. మొత్తం 10వేల మంది ఉద్యోగులు ఈ కంపెనీలో పనిచేస్తున్నారు. త్వరలోనే 680 మిలియన్ డాలర్ల వ్యయంతో భారీ ట్రేడ్ సెంటర్ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది.

## ఇమ్రాన్ హత్యకు నఖ్వీ కుట్ర
## పాక్ మాజీ ప్రధాని సోదరీమణుల ఆరోపణ

పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ ఆరోగ్యంపై తీవ్ర చర్చ జరుగుతోంది. ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని పలువురు క్రికెట్ దిగ్గజాలు పాక్ ప్రభుత్వాన్ని కోరిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇమ్రాన్ తోబుట్టువులు సంచలన ఆరోపణలు చేశారు. పాకిస్థాన్ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్ ఆసిమ్ మునీర్, పీసీబీ చీఫ్ మోసిన్ నఖ్వీ తమ సోదరుడి హత్యకు కుట్ర పన్నుతున్నారంటూ ఆరోపించారు. ఈ కుట్ర గురించి ఇటీవల ఇమ్రాన్ తమకు చెప్పారని పేర్కొన్నారు. "వారు



నన్ను చంపుతారు. నన్ను చంపడానికి పథకం వేశారు" అని తమ సోదరుడితో జరిగిన సంభాషణను ఉజ్మా ఖాన్, అలీమాఖాన్ మీడియాకు వెల్లడించారు. "మోసిన్ మమ్మల్ని బెదిరిస్తున్నాడు. మా సోదరుడికి కానీ, మాకు కానీ ఏమైనా జరిగితే.. ఎవరినీ వదిలిపెట్టం" అని హెచ్చరించారు. జైలు గదిలో సుదీర్ఘకాలంగా ఒంటరిగా ఉంచడంతో ఇమ్రాన్ కంటిచూపు కోల్పోతున్నారని, ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తోందని పాక్ సుప్రీంకోర్టు నియమించిన న్యాయవాది పరిశీలనలో వెల్లడైన సంగతి తెలిసిందే. ఆయన కుడికన్ను చూపు 85% కోల్పోయినట్లు వార్తలు వచ్చాయి. వెంటనే ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించాలని అధికారులను కోర్టు ఆదేశించింది.

## జాతీయ భద్రతకు రాహుల్ గాంధీ ప్రమాదకరం

**: రిజిజు**


కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తీవ్ర ఆరోపణలు చేశారు. రాహుల్‌కు భారత వ్యతిరేక శక్తులతో సంబంధాలు ఉన్నాయని అన్నారు. విదేశీ పర్యటనల సమయంలో వేర్పాటువాదులు, మావోయిస్టులు, అమెరికాకు చెందిన ప్రముఖ పెట్టుబడిదారుడు జార్జిసోరస్ వంటి వ్యక్తులతో సమావేశమవుతున్నారని ఆరోపించారు. దేశ వ్యతిరేక శక్తులతో చేతులు కలిపే ఆయన జాతీయ భద్రతకు చాలా ప్రమాదకరమన్నారు. ఏఎన్ఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో రిజిజు ఈ వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పై ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానానికి సిద్ధమవడంపై రిజిజు మాట్లాడుతూ.. ప్రతిపక్షాలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ నేతలు, ముఖ్యంగా రాహుల్ గాంధీ వారి వ్యాఖ్యలతో చర్చలకు తరచూ అంతరాయం కలిగిస్తారన్నారు. దేశ చరిత్రలో ఎప్పుడూ ఆయనలాంటి ప్రతిపక్ష నేతను చూడలేదన్నారు. పార్లమెంట్ సమావేశాలు జరగనీయకూడదనే ఉద్దేశంతో కాగితాలు విసిరేయడం, నినాదాలు చేస్తూ వాకౌట్ చేయడం వంటి చిన్న పిల్లల చర్యలు



చేస్తుంటారని అసహనం వ్యక్తంచేశారు. రాహుల్ ఈ విధంగా ప్రతిసారీ సభకు అంతరాయం కలిగించడం వల్ల ప్రజల సమస్యల గురించి మాట్లాడాలనుకున్న ఇతర చిన్న పార్టీల నేతలకు అవకాశం ఉండట్లేదన్నారు. అమెరికా ప్రభుత్వానికి భారత్ తలొగ్గిందని.. జాతీయ ప్రయోజనాలతో రాజీ పడుతోందని ఇటీవల లోక్‌సభలో రాహుల్ ఆరోపించిన విషయం తెలిసిందే. అయితే రాహుల్ వ్యాఖ్యలతో దేశాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని భాజపా పార్లమెంటు సభ్యుడు నిషికాంత్ దూబే ఆరోపిస్తూ.. ఫిబ్రవరి 12న లోక్‌సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఇందుకుగాను రాహుల్ పార్లమెంటరీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని.. ఎన్నికల్లో పోటీ చేయకుండా జీవితకాల నిషేధం విధించాలని కోరారు. ఈ నేపథ్యంలో రాహుల్‌పై కిరణ్ రిజిజు ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

## ఇరాన్‌పై భారీ దాడికి అమెరికా సిద్ధమవుతోందా?


అమెరికా, ఇరాన్ (Iran) మధ్య అణు చర్చలపై ప్రతిష్టంభన నెలకొన్న వేళ ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇరాన్‌పై అమెరికా త్వరలోనే భారీ దాడులకు దిగవచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి. గతేడాది ఇరాన్‌పై ఇజ్రాయెల్ 12రోజుల పాటు చేసిన యుద్ధం కన్నా భారీ స్థాయిలో ఈ సైనిక చర్య ఉండవచ్చని ఆక్సియోస్ నివేదిక అంచనా వేసింది. "ట్రంప్ విసిగిపోతున్నారు. యుద్ధానికి వెళ్లవద్దని ఆయన చుట్టూ ఉన్న కొందరు హెచ్చరిస్తున్నారు. కానీ, మరికొన్ని వారాల్లోనే భారీ స్థాయి సైనిక చర్య ఉండే అవకాశాలు 90శాతం ఉన్నాయి" అని అమెరికా అధ్యక్షుడి సలహాదారుడు చెప్పినట్లు తాజా నివేదిక వెల్లడించింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీతో ట్రంప్ సలహాదారులు జారెడ్ కుష్నర్, స్టీవ్ విట్‌కాఫ్‌లు జెనీవాలో చర్చలు జరిపిన నేపథ్యంలో ఈ నివేదిక రావడం గమనార్హం. అయితే,



చర్చల్లోని అంశాలపై నిర్ణయం తీసుకునేందుకు ఇరాన్‌కు రెండు వారాల గడువు ఉండడం, ఇదే సమయంలో వైట్‌హౌస్ యుద్ధానికి సన్నాహాలు చేసుకుంటున్నట్లు తాజా నివేదికలు అంచనా వేస్తున్నాయి.

## బంగ్లాదేశ్ అధ్యక్షుడిగా యూనస్..?

బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన బీఎన్‌పీ ఛైర్మన్ తారిఖ్ రెహమాన్ నూతన ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఆ దేశంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో ఇప్పటివరకు తాత్కాలిక ప్రభుత్వ సారథిగా ఉన్న మహమ్మద్ యూనస్ భవితవ్యంపై సందిగ్ధత ఏర్పడింది. ఈ క్రమంలోనే ఆయన బంగ్లాదేశ్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టనున్నట్లు స్థానిక మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ప్రస్తుత అధ్యక్షుడు మహమ్మద్ షాబుద్దీన్ పదవి నుంచి దిగిపోయే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్ అధ్యక్షుడు మహమ్మద్ షాబుద్దీన్ పదవీకాలం 2028 ఏప్రిల్ వరకు ఉన్నప్పటికీ అధ్యక్ష పదవి నుంచి దిగిపోయేందుకు అంగీకరించినట్లు తెలుస్తోంది. గతంలో పలుమార్లు యూనస్ నేతృత్వంలోని ప్రభుత్వం గౌరవం ఇవ్వట్లేదని.. ఫిబ్రవరిలో బంగ్లా ఎన్నికలు జరిగిన అనంతరం పదవికి రాజీనామా చేస్తానని చెప్పారు. ఈ క్రమంలోనే యూనస్‌కు అధ్యక్ష బాధ్యతలు అప్పగించే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. కాగా ఈ విషయంపై బంగ్లా ప్రభుత్వం అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది.



## ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి...

**అయినప్పటికీ లాభాల్లో ముగిసిన మార్కెట్లు**

**బ్యాంకింగ్, మెటల్, ఎఫ్ఎంసీజీ రంగాల షేర్ల అండతో లాభాలతో ముగిసిన సూచీలు**

**283 పాయింట్ల లాభంతో 83,734 వద్ద ముగిసిన సెన్సెక్స్**

**వరుసగా మూడో సెషన్‌లో లాభాలను నమోదు చేసిన నిఫ్టీ**

**డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలహీనపడిన రూపాయి**



**ముంబై:** ఐటీ రంగ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగినప్పటికీ, దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాలతో ముగిశాయి. బ్యాంకింగ్, మెటల్, ఎఫ్ఎంసీజీ స్టాక్స్‌లో వెల్లువెత్తిన కొనుగోళ్లు మార్కెట్లకు అండగా నిలిచాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 283 పాయింట్లు పెరిగి 83,734 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 93 పాయింట్లు లాభపడి 25,819 వద్ద నిలిచింది. నిఫ్టీ లాభాల్లో ముగియడం ఇది వరుసగా మూడో సెషన్ కావడం గమనార్హం.

రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఐటీ సూచీ 1.23 శాతం నష్టపోగా, మిగిలిన అన్ని సూచీలు గ్రీన్ మార్క్‌లో ముగిశాయి. నిఫ్టీ ఎఫ్ఎంసీజీ, మెటల్, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు వరుసగా 1.21 శాతం, 1.33 శాతం, 1.31 శాతం చొప్పున లాభపడ్డాయి. బ్రాడర్ మార్కెట్లు కూడా సూచీలకు అనుగుణంగానే రాణించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.50 శాతం, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.54 శాతం లాభపడ్డాయి.

ఉదయం సెషన్‌లో నష్టాల్లోకి జారుకున్న మార్కెట్లు, మధ్యాహ్నం తర్వాత బలమైన రికవరీ కనబరిచాయి. సెన్సెక్స్ తన కనిష్ట స్థాయి అయిన 83,206 నుంచి 585 పాయింట్లకు పైగా పుంజుకుంది. దేశీయ సంస్థాగత మదుపరుల (డీఐఐ) నుంచి పెట్టుబడులు నిలకడగా కొనసాగడం మార్కెట్లకు బలమైన మద్దతు ఇస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు. దేశీయ వృద్ధి అవకాశాలపై ఉన్న సానుకూల దృక్పథంతో సెంటిమెంట్ బలంగానే ఉందని వారు తెలిపారు. మరోవైపు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 2 పైసలు స్వల్పంగా బలహీనపడి 90.66 వద్ద ట్రేడ్ అయింది. బీఎస్ఈలో 2,110 షేర్లు లాభపడగా, 1,916 షేర్లు నష్టపోయాయి.

## భారత్ మరో కీలక అడుగు..

**దేశీయంగా హేమర్ క్షిపణులు ఉత్పత్తి**

**ఇప్పటికే రష్యా సహకారంతో బ్రహ్మోస్ క్షిపణులను తయారు చేస్తున్న ఇండియా**

**తాజాగా ఫ్రాన్స్ సహకారంతో హేమర్ క్షిపణులను తయారు చేయనున్న భారత్**

**ఆపరేషన్ సిందూర్ సమయంలో హేమర్ క్షిపణులను వాడిన ఇండియా**




**న్యూఢిల్లీ:** మేకిన్ ఇండియాలో భాగంగా ఇప్పటికే భారత్ పలు ఆయుధాలను సొంతంగా తయారు చేస్తోంది. రష్యా సమన్వయంతో శత్రు భయంకర బ్రహ్మోస్ క్షిపణులను ఇండియా తయారు చేస్తున్న సంగతి తెలిసిందే. ఆపరేషన్ సిందూర్ సమయంలో బ్రహ్మోస్ క్షిపణుల దెబ్బకు పాకిస్థాన్ బెంబేలెత్తిపోయింది. తాజాగా భారత్ మరో ముందడుకు వేసింది. ఫ్రాన్స్ సహకారంతో భారత్ దేశీయంగా హ్యామర్ క్షిపణులను తయారు చేయనుంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ ప్రధాని మోదీ మధ్య దీనిపై ఒప్పందం కుదిరింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ ఈ క్షిపణులను కూడా వాడింది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ వద్ద ఉన్న రఫేల్ యుద్ధ విమానాలకు హేమర్ క్షిపణులను జోడించారు. తాజాగా మరో 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు భారత రక్షణ శాఖ క్లియరెన్స్ ఇచ్చింది. వీటికోసం అదనంగా హేమర్ క్షిపణులు తయారు చేయాల్సి ఉంటుంది. స్వదేశీ తేజస్ యుద్ధ విమానాలకు కూడా ఈ క్షిపణులను జోడించనున్నారు. ఈ క్షిపణులను ఇండియాలోనే భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్), ఫ్రాన్స్‌కు చెందిన సఫ్రాన్ సంయుక్తంగా తయారు చేయనున్నాయి. మేకిన్ ఇండియా ప్రోగ్రామ్‌లో భాగంగా హెచ్125 హెలికాప్టర్లను కూడా స్వదేశీయంగా తయారు చేయనున్నారు. కర్నాటకలోని వేమగాల్‌లో అసెంబ్లింగ్ యూనిట్ ప్రారంభమైంది. వీటిని యూరోపియన్ సంస్థ ఎయిర్‌బస్, భారత్‌కు చెందిన టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ సంయుక్తంగా తయారు చేస్తున్నాయి. ఇది లైట్ మల్టీరోల్ హెలికాప్టర్. మంచు పర్వతాల్లోనూ సత్తా చాటుతుంది. హిమాలయాల్లోని ఎవరెస్ట్ శిఖరం అంత ఎత్తు వరకు ఇది ఎగరగలదు.

## సేవలు అందుబాటులోకి వచ్చాయి..

**సహనంతో ఉన్నందుకు ధన్యవాదాలు: యూట్యూబ్**

**సమస్యను పరిష్కరించినట్లు తెలిపిన యూట్యూబ్**

**ఫిర్యాదులు రావడంతో సమస్యను పరిష్కరించామన్న యూట్యూబ్**

**3,21,958 ఫిర్యాదులు చూపించిన అవటేజ్ ట్రాకింగ్ సైట్ డౌన్‌డిటెక్టర్**



**న్యూఢిల్లీ:** గూగుల్ యాజమాన్యంలోని వీడియో ప్లాట్‌ఫామ్ యూట్యూబ్ సేవల్లో బుధవారం కొంతసేపు అంతరాయం ఏర్పడిన విషయం తెలిసిందే. లక్షలాది మంది వినియోగదారులకు లాగిన్‌లో ఇబ్బంది, ప్లే కాకపోవడం వంటి సమస్యలు తలెత్తాయి. అయితే ఈ సాంకేతిక సమస్యను పరిష్కరించినట్లు యూట్యూబ్ యాజమాన్యం వెల్లడించింది. స్ట్రీమింగ్‌లో సమస్యలు ఎదురవుతున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని తెలిపింది.

రికమెండేషన్ సిస్టంలో సమస్య వల్ల యూట్యూబ్ హోంపేజీ, యాప్, యూట్యూబ్ కిడ్స్, మ్యూజిక్‌లో వీడియోలు రాలేదని తెలిపింది. లాగిన్ కాలేకపోయామని కొందరి నుంచి ఫిర్యాదులు అందాయని తెలిపింది. ఈ విస్తృత సమస్యను పరిష్కరించామని, ప్రస్తుతం అన్ని సేవలు యథావిధిగా అందుబాటులోకి వచ్చాయని తెలిపింది.

ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది వినియోగదారులు అంతరాయంపై ఫిర్యాదు చేయడంతో దానిని పునరుద్ధరించినట్లు యూట్యూబ్ వెల్లడించింది. ఈ సమస్యను అన్నిచోట్ల పరిష్కరించినట్లు తెలిపింది. సాంకేతిక సమస్యను పరిష్కరించేంత వరకు సహనం వహించిన వినియోగదారులకు ధన్యవాదాలు కూడా తెలిపింది. ఈ మేరకు టీమ్ యూట్యూబ్ 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది.

కాగా, అవుటేజ్-ట్రాకింగ్ సైట్ డౌన్‌డిటెక్టర్ యూట్యూబ్‌పై 3,21,958 ఫిర్యాదులు వచ్చినట్లు సూచించింది. భారత్‌లో ఉదయం ఆరు గంటల ప్రాంతంలో 20,000 ఫిర్యాదులు వచ్చినట్లు సూచించింది. ఇందులో ఎక్కువగా యూట్యూబ్ యాప్ వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదుగా తెలిపింది.




# దూబే మెరుపులు..

**అజేయంగా సూపర్ 8కు టీమిండియా..!**

**అహ్మదాబాద్:** హ్యాట్రిక్ విజయాలతో సూపర్ 8కు దూసుకెళ్లిన భారత్ చివరి లీగ్ మ్యాచ్‌లోనూ జయభేరి మోగించింది. టాపార్డర్ రాణించకున్నా శివం దూబే(66) అర్థ శతకంతో కదం తొక్కి భారీ స్కోర్ అందించగా.. మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి(3-14) బంతితో నెదర్లాండ్స్ బ్యాటర్లను హడలెత్తించాడు. లీడే(33), అకెర్‌మన్(23)లు పోరాడినా.. 176కే కట్టడి చేసింది. 17 పరుగుల తేడాతో విజయం సాధించి.. అజేయంగా నాకౌట్ దశకు చేరుకుంది.

మూడోసారి పొట్టి ప్రపంచకప్‌పై గురి పెట్టిన భారత్.. లీగ్ దశను అజేయంగా ముగించింది. గత మ్యాచ్‌లో పాకిస్థాన్‌ను చిత్తు చేసి నాకౌట్ దశకు చేరుకున్న టీమిండియా.. చివరి లీగ్ మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌ను ఓడించింది. శివం దూబే(66) మెరుపులతో 193 రన్స్ కొట్టిన భారత జట్టు.. అనంతరం వరుణ్ చక్రవర్తి(3-14), దూబే(2-35)లు రాణించగా కట్టడి చేసింది.

భారత్ నిర్దేశించిన లక్ష్య ఛేదనలో నెదర్లాండ్స్ ఓపెనర్లు దూకుడుగా ఆడే ప్రయత్నం చేశారు. అయితే.. బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్‌లు పవర్ ప్లేలో కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో వారి వ్యూహం ఫలించలేదు. వరుణ్ చక్రవర్తి తొలి బ్రేకిస్తూ మ్యాక్స్ డీ డౌడ్(20)ను ఔట్ చేశాడు. అనంతరం.. పాండ్యా ఓవర్లో మైఖేల్ లెవిట్(24)ను పెవిలియన్ చేర్చగా.. బాస్ డీ లీడే(33), కొలిన్ అకెర్‌మన్(23)లు ధాటిగా ఆడారు. కానీ. దూబే ఓవర్లో లీడే ఔట్ కాగా.. అకెర్‌మన్‌ను చక్రవర్తి డౌగౌట్ పంపాడు. దాంతో.. 94కే నాలుగు వికెట్లు కోల్పోయిన డచ్ జట్టు.. ఇన్నింగ్స్ 120లోపే ముగిస్తుందనిపించింది. కానీ.. ఆఖర్లో జాజ్ లయన్ (26), నోహ్ క్రాయెస్(25 నాటౌట్) బౌండరీలతో చెలరేగి ఓటమి అంతరాన్ని తగ్గించారు.




**దూబే, పాండ్యా ధనాధన్**

అహ్మదాబాద్‌లో ఓపెనర్ అభిషేక్ శర్మ(0) డకౌటైనా.. శివం దూబే(66) శివాలూగిపోయాడు. టాపార్డర్ విఫలమైనా నేనున్నానుగా అంటూ అర్థ శతకంతో విరుచుకుపడిన ఈ చిచ్చరపిడుగు భారీ స్కోర్ అందించాడు. తిలక్ వర్మ,(31), సూర్యకుమార్ యాదవ్(34) మెరుపులను కొనసాగించిన దూబే.. నెదర్లాండ్స్ బౌలర్లను బెంబేలెత్తించాడు. హార్దిక్ పాండ్యా(30)తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పిన దూబే.. ఈ టోర్నీలో రెండో హాఫ్ సెంచరీ సాధించాడు. డెత్ ఓవర్లలో దూబే, పాండ్యా మరింత చెలరేగడంతో ప్రత్యర్థికి టీమిండియా 194 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.

## బీజేపీ దాదాగిరి వల్లే క్రికెటర్లు షేక్‌హ్యాండ్ ఇచ్చుకోవడం లేదు: సంజయ్ రౌత్




**ముంబై:** ఇండియా,పాకిస్తాన్ క్రికెటర్లు .. మ్యాచ్ టైంలో పరస్పరం షేక్‌హ్యాండ్ ఇచ్చుకోవడంలేదు. ఆపరేషన్ సింధూర్ తర్వాత ఇరు జట్ల ఆటగాళ్లు ఐసీసీ టోర్నీల్లో తలపడిన సమయంలో కరచాలనం చేసుకునేందుకు నిరాకరిస్తున్నారు. ఈ అంశంపై శివసేన ఎంపీ సంజయ్ రౌత్(రాజీనితీజీఎ ఖీజీబీబి) స్పందించారు. బీజేపీ, కేంద్ర ప్రభుత్వం దాదాగిరి చేయడం వల్ల భారత క్రికెటర్లు పాక్ ఆటగాళ్లకు షేక్‌హ్యాండ్ ఇవ్వడం లేదని రౌత్ ఆరోపించారు. ఆసియాకప్‌లో ఆ తర్వాత గత ఆదివారం వరల్డ్‌కప్‌లో రెండు జట్లు పోటీపడ్డాయి. ఆ సమయంలో ఇరు జట్ల ఆటగాళ్లు హ్యాండ్‌షేక్ ఇచ్చుకోని విషయం తెలిసిందే.

పాకిస్థాన్, భారత్ మధ్య క్రికెట్ మ్యాచ్‌లు జరగాల్సిన అవసరం లేదని సంజయ్ రౌత్ అభిప్రాయపడ్డారు. ఒకవేళ మీరు ఆడాలనుకుంటే, అప్పుడు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. షేక్‌హ్యాండ్ ఇచ్చుకోవడం లేదంటే అప్పుడు బీజేపీ, కేంద్ర ప్రభుత్వం ఆటగాళ్లపై దాదాగిరీ ప్రదర్శిస్తున్నట్లే అవుతుందన్నారు. అసలు మీరెందుకు ఆడుతున్నారు, ఒకవేళ పాకిస్థాన్‌తో ఆడకుంటే ఏమవుతుందని ఆయన ప్రశ్నించారు.

పాకిస్థాన్‌తో ఆడడం వల్ల బెట్టింగ్‌లో వేల కోట్లు ఆర్జిస్తున్నారని, దీంట్లో సగం డబ్బు పాకిస్థాన్‌కు వెళ్తుందని, ఆ డబ్బు నేరుగా దావూద్ ఇబ్రహీం, మసూద్ అజార్‌కు వెళ్తుందని, దీని వల్ల ఉగ్రవాదం మళ్లీ బలపడుతుందని శివసేన ఎంపీ రౌత్ అన్నారు.

## యూఏఈపై ఆరు వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా విజయం




**న్యూఢిల్లీ:** టీ20 వరల్డ్‌కప్ గ్రూప్ డీ మ్యాచ్‌లో ఇవాళ దక్షిణాఫ్రికా జట్టు ఆరు వికెట్ల తేడాతో యూఏఈపై విజయం సాధించింది. దీంతో తమ గ్రూపులోని అన్ని మ్యాచ్‌ల్లో దక్షిణాఫ్రికా విక్టరీ నమోదు చేసింది. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన యూఏఈ నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 122 రన్స్ చేసింది. టాపార్డర్‌లో అలీషాన్ షారఫూ అత్యధికంగా 45 రన్స్ చేశాడు. అయితే ఆ టార్గెట్‌ను కేవలం 13.2 ఓవర్లలో సఫారీలు అందుకున్నారు. దక్షిణాఫ్రికా బ్యాటర్ రికల్టన్ 16 బంతుల్లో 30 రన్స్ చేయగా, బ్రెవిస్ 25 బంతుల్లో 36 రన్స్ స్కోరు చేశారు. మరో 40 బంతులు మిగిలి ఉండగానే దక్షిణాఫ్రికా విజయ కేతనం ఎగురవేసింది. సఫారీ బౌలర్ కార్బిన్ బాష్ ఈ మ్యాచ్‌లో మూడు వికెట్లు తీసుకున్నాడు. గ్రూపు డీ నుంచి ఇప్పటికే దక్షిణఫ్రికాతో పాటు న్యూజిలాండ్ .. సూపర్-8 స్టేజ్‌కు క్వాలిఫై అయ్యాయి.

# రంజీ ట్రోఫీలో చరిత్ర సృష్టించిన జమ్మూకశ్మీర్ జట్టు

**రంజీ ట్రోఫీ చరిత్రలో తొలిసారి ఫైనల్‌కు చేరిన జమ్మూకశ్మీర్**

**సెమీస్‌లో బలమైన బెంగాల్ జట్టుపై 6 వికెట్ల తేడాతో ఘనవిజయం**

**9 వికెట్లతో సత్తా చాటిన పేసర్ ఆకిబ్ నబీకి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్**

**అబ్దుల్ సమద్, వంశజ్ శర్మ రాణింపుతో సులభమైన ఛేదన**

**ఫైనల్లో కర్ణాటకతో తలపడనున్న కశ్మీర్ జట్టు**



**బెంగాల్:** రంజీ ట్రోఫీ చరిత్రలో జమ్మూకశ్మీర్ జట్టు సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. దేశవాళీ క్రికెట్‌లో బలమైన జట్లలో ఒకటైన బెంగాల్‌ను మట్టికరిపించి తొలిసారి ఫైనల్‌లో అడుగుపెట్టింది. కల్యాణిలోని బెంగాల్ క్రికెట్ అకాడమీ మైదానంలో బుధవారం ముగిసిన సెమీఫైనల్ మ్యాచ్‌లో, నాలుగో రోజే జమ్మూకశ్మీర్ 6 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. గత కొన్నేళ్లుగా రెడ్ బాల్ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తున్న కశ్మీర్ జట్టుకు ఇది అతిపెద్ద, చారిత్రక విజయం.

ఈ మ్యాచ్‌లో జమ్మూకశ్మీర్ విజయంలో కీలక పాత్ర పోషించింది వారి బౌలర్లే. ముఖ్యంగా మూడో రోజు ఆటలో బెంగాల్‌ను రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 99 పరుగులకే కుప్పకూల్చి మ్యాచ్‌ను తమవైపు తిప్పుకున్నారు. సీమ్ ఆల్‌రౌండర్ ఆకిబ్ నబీ నాలుగు వికెట్లతో బెంగాల్ పతనాన్ని శాసించగా, అతనికి సునీల్ కుమార్ చక్కటి సహకారం అందించాడు. దీంతో జమ్మూకశ్మీర్ ముందు 126 పరుగుల స్వల్ప లక్ష్యం నిలిచింది. అనంతరం లక్ష్య ఛేదనకు బరిలోకి దిగిన జమ్మూకశ్మీర్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. బెంగాల్ పేసర్లు మహ్మద్ షమీ, ఆకాశ్ దీప్ విజృంభించడంతో శుభమ్ పుండిర్ (27), కెప్టెన్ పరాస్ డోగ్రా (9) త్వరగానే వెనుదిరిగారు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన అబ్దుల్ సమద్ ఎదురుదాడికి దిగాడు. షాబాజ్ అహ్మద్ బౌలింగ్‌లో లాంగాన్, ఎక్స్‌ట్రా కవర్ మీదుగా రెండు భారీ సిక్సర్లు బాది మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. మరోవైపు వంశజ్ శర్మ నిలకడగా ఆడుతూ స్కోరు బోర్డును నడిపించాడు. చివరగా ముఖేశ్ కుమార్ బౌలింగ్‌లో సిక్స్ కొట్టిన వంశజ్, జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. విజయం ఖరారు కాగానే జమ్మూకశ్మీర్ ఆటగాళ్ల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. మైదానంలోకి పరుగెత్తుకొచ్చి తమ కోచ్‌ను గాల్లోకి ఎగరేసి సంబరాలు జరుపుకున్నారు. మ్యాచ్‌లో మొత్తం 9 వికెట్లు పడగొట్టిన ఆకిబ్ నబీకి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఫిబ్రవరి 24 నుంచి 28 వరకు జరిగే ఫైనల్లో జమ్మూకశ్మీర్ జట్టు కర్ణాటకతో తలపడనుంది.

MOVIE TIME

# అల్లు, అట్లీల మూవీ రికార్డు

## అనౌన్స్‌మెంట్ సాంగ్‌కు మిలియన్ వ్యూయర్స్



**టాకీస్:** ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరియు స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో వస్తున్న భారీ ప్రాజెక్ట్ ఎఎ23. కేవలం ఒక చిన్న అనౌన్స్‌మెంట్ వీడియోతోనే సరికొత్త చరిత్రను సృష్టించింది ఈ కాంబో. అయితే సినిమా కోసం సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ ఓ పాటను కంపోజ్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ పాట ఇన్‌స్టాగ్రామ్‌లో అరుదైన రికార్డును అందుకుంది. ఈ పాటకి ఇన్‌స్టాలో 1 మిలియన్ కంటే ఎక్కువ రీల్స్ అందుకున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. దీంతో ఒక ఇండియన్ ఫిల్మ్ అనౌన్స్‌మెంట్ థీమ్ ఈ స్థాయిలో వైరల్ అవ్వడం ఇదే తొలిసారి అని ట్రేడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ అరుదైన ఘనత సాధించిన సందర్భంగా అల్లు అర్జున్, లోకేష్ కనగరాజ్ కలిసి దిగిన ఫోటో ప్రస్తుతం ఇంటర్నెట్‌లో తెగ చక్కర్లు కొడుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ షూటింగ్ 2026లో ప్రారంభం కానుంది.

# ది కేరళ స్టోరీ సీక్వెల్..ట్రైలర్ విడుదల

## సంచలనం సృష్టిస్తున్న ట్రైలర్

**టాకీస్:** 2023లో బాక్సాఫీస్ వద్ద వివాదాలు సృష్టించిన 'ది కేరళ స్టోరీ' చిత్రానికి సీక్వెల్‌గా 'ది కేరళ స్టోరీ 2: గోస్ బియాండ్' ప్రేక్షకుల ముందుకు రాబోతున్న సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 27న ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో, తాజాగా చిత్ర యూనిట్ ట్రైలర్‌ను విడుదల చేయగా.. ఈ ట్రైలర్ సామాజిక మాధ్యమాల్లో పెను దుమారం రేపుతోంది. మొదటి భాగం కంటే ఈ సీక్వెల్ మరింత వివాదాస్పదంగా, అత్యంత తీవ్రమైన అంశాలతో రూపొందినట్లు ట్రైలర్ చూస్తుంటే స్పష్టమవుతోంది. రాబోయే 25 ఏళ్లలో భారత్ ఇస్లామిక్ రాజ్యంగా మారుతుంది అనే వివాదాస్పద డైలాగ్‌తో ఈ ట్రైలర్ ప్రారంభంకాగా.. ఈసారి దర్శకుడు కామాఖ్య నారాయణ్ సింగ్ కథను కేవలం కేరళకే పరిమితం చేయకుండా.. రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో జరుగుతున్నట్లు చెబుతున్న బలవంతపు మత మార్పిడిలు, లవ్ జిహాద్ వంటి అంశాలను ఇందులో చూపించారు. నిర్మాత విపుల్ అమృత్‌లాల్ షా నిర్మించిన ఈ చిత్రంలో గతంలో నటించిన అదా శర్మ స్థానంలో ఉల్కా గుప్తా, అదితి భాటియా, ఐశ్వర్య ఓజా ప్రధాన పాత్రలు పోషించారు. మత మార్పిడికి నిరాకరించిన యువతులను చిత్రహింసలకు గురిచేయడం, బలవంతంగా గొడ్డు మాంసం తినిపించడం వంటి కఠినమైన దృశ్యాలను మేకర్స్ ఈ ట్రైలర్‌లో పొందుపరిచారు. అయితే ఈ ట్రైలర్‌పై కేరళ నెటిజన్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ముఖ్యంగా బలవంతంగా గొడ్డు మాంసం తినిపించే సన్నివేశంపై వారు మండిపడుతున్నారు. కేరళలో బీఫ్‌ను అందరూ ఇష్టంగా తింటారని, ఎవరికీ బలవంతంగా తినిపించాల్సిన అవసరం లేదని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. మరోవైపు, ఈ సినిమా సమాజంలోని చేదు నిజాలను ధైర్యంగా చూపిస్తోందని మరికొందరు సమర్థిస్తున్నారు.






# గ్లోబల్ స్టార్ కాబోతున్న ప్రియమణి


## ఇండో-అమెరికన్ మూవీలో నటించబోతున్న ప్రియమణి

## అమెరికాకు చెందిన రెడ్ బైసన్ ప్రొడక్షన్స్, ముంబైలోని అజూర్ ఎంటర్టైన్మెంట్ సంయుక్తంగా నిర్మించనున్న మూవీ

## ఏప్రిల్‌లో ప్రారంభం కానున్న షూటింగ్

టాకీస్: టాలీవుడ్ నుంచి బాలీవుడ్ కు వెళ్లిన ప్రియమణి.. పలు వెబ్ సిరీస్ లలో కూడా నటిస్తూ బిజీగా ఉంటోంది. ఇప్పుడు హాలీవుడ్ మూవీలో నటించేందుకు సిద్ధమవుతోంది. ఇండో-అమెరికన్ చిత్రంలో ప్రియమణి ప్రధాన పాత్రకు ఎంపికయింది. బాలీవుడ్ నటుడు మోహిత్ రైనాతో కలిసి ఆమె ఈ అంతర్జాతీయ చిత్రంలో నటించబోతోంది. హర్ష్ మహదేశ్వర్ దర్శకత్వం వహించనున్న ఈ సినిమాను అమెరికాకు చెందిన రెడ్ బైసన్ ప్రొడక్షన్స్, ముంబైలోని అజూర్ ఎంటర్టైన్మెంట్ సంయుక్తంగా నిర్మించనున్నాయి. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా నిర్మాణ సంస్థలు అధికారికంగా ప్రకటించాయి. భారతీయ, అమెరికా సంస్కృతుల కలయికతో, ఒక వలస కుటుంబం ఎదుర్కొనే భావోద్వేగపూరిత ప్రయాణమే ఈ సినిమా కథాంశం. హాలీవుడ్ సూపర్ హిట్ సినిమాలకు పనిచేసిన అగ్రశ్రేణి సాంకేతిక నిపుణులు ఈ ప్రాజెక్ట్ కోసం పనిచేస్తుండటం గమనార్హం. ఈ సినిమా షూటింగ్ ఏప్రిల్ లో ప్రారంభం కానుంది.

# అక్కినేని ప్రేమాభిషేకానికి 45 ఏళ్లు పూర్తి




టాకీస్: అక్కినేని నాగేశ్వరరావు నటించిన చిత్రాల్లో ఎప్పటికీ గుర్తుండిపోయే ఐకానిక్ సినిమా 'ప్రేమాభిషేకం'. అప్పట్లో ఇది సిల్వర్ జూబ్లీ జరుపుకుంది. దేవదాసు తరవాత మళ్లీ అంతటి సినిమాగా ప్రాచుర్యం పొందింది. ఈచిత్రం విడుదలై 45 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అన్నపూర్ణ స్టూడియోస్ ప్రత్యేక వీడియోను పంచుకుంది. లక్షల మంది హృదయాల్లో ఏఎన్నార్ ఎప్పటికీ జీవించే ఉ ంటారని పేర్కొంది.



## మరో ఇంటెన్స్ రోల్‌లో

# అనుపమ పరమేశ్వరన్

టాకీస్: టాలీవుడ్ క్యూట్ సెన్సేషన్, పాన్ ఇండియా నటి అనుపమ పరమేశ్వరన్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ అందింది. ఆమె ప్రధాన పాత్రలో ఒక భారీ సైకలాజికల్ థ్రిల్లర్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఎస్ కే గి ఎంటర్టైన్మెంట్ మరియు బెంచ్‌మార్క్ స్టోరీటెల్లర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఆర్జే షాన్ దర్శకత్వం వహించబోతున్నాడు. గతంలో అనుపమ మరియు షాన్ కాంబినేషన్‌లో వచ్చిన ఒక షార్ట్ ఫిల్మ్ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై సెన్సేషన్ క్రియేట్ చేయడంతో, ఇప్పుడు అదే జోడీ వెండితెరపై మ్యాజిక్ చేయడానికి సిద్ధమవుతుంది. శివిన్ నారంగ్, ప్రేరణ అరోరా, కిరణ్ బల్లపల్లి నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ చిత్రం ఒక ప్రముఖ స్టూడియో భాగస్వామ్యంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందనుంది. ముఖ్యంగా ఈ చిత్ర నిర్మాత ప్రేరణ అరోరా గతంలో బాలీవుడ్‌లో 'రుస్తుం', 'ప్యాడ్ మ్యాన్', 'టాయిలెట్: ఏక్ ప్రేమ్ కథ' వంటి జాతీయ స్థాయి విజయవంతమైన చిత్రాలను నిర్మించి తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఇటీవలే 'జటాధర' మూవీని పట్టాలెక్కించిన ఈ సంస్థ, ఇప్పుడు అనుపమతో ఈ ఇంటెన్స్ థ్రిల్లర్‌ను అనౌన్స్ చేయడం విశేషం. మే నెలలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్న ఈ సినిమా టైటిల్‌ను త్వరలోనే వెల్లడిస్తామని చిత్ర బృందం తెలిపింది. 'ప్రేమమ్', 'కార్తికేయ 2', 'రాక్షసుడు' వంటి హిట్స్‌తో సౌత్ ఇండియాలో బిజీ హీరోయిన్‌గా మారిన అనుపమ, ఈ సైకలాజికల్ థ్రిల్లర్‌తో తన నటనలో మరో కొత్త కోణాన్ని ఆవిష్కరించబోతోంది. ఇక ఆమె పుట్టినరోజు కానుకగా వచ్చిన ఈ ప్రకటనతో అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు.

# నాకు శక్తి..ప్రేరణ అన్నీ సురేఖయే

## భార్య పుట్టిన రోజు చిరు ఎమోషనల్ పోస్ట్





**టాకీస్:** మెగాస్టార్ చిరంజీవి తన సతీమణి సురేఖ పుట్టినరోజు మరియు వారి వివాహ వార్షికోత్సవం సందర్భంగా సోషల్ మీడియా వేదికగా ఎమోషనల్ పోస్ట్‌ను పంచుకున్నారు. తన సినీ ప్రయాణంలోనే కాకుండా, జీవిత ప్రయాణంలోనూ తనకు అండగా నిలిచిన సురేఖపై తనకున్న అపారమైన ప్రేమాభిమానాలను ఆయన ఈ సందర్భంగా చాటుకున్నారు. 1980 ఫిబ్రవరి 20న వివాహం చేసుకున్న ఈ జంట త్వరలోనే 46వ వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకోనుండగా, సురేఖ తన విజయాల వెనుక ఉన్న అసలు శక్తి అని చిరంజీవి కొనియాడారు. తన ప్రతి అడుగులో వెంట నడిచిన సురేఖకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ, ఆమె తమ కుటుంబానికి కేంద్రబిందువని, అందరినీ ప్రేమానురాగాలతో ఒక్కటిగా ఉంచే శక్తి ఆమెకే ఉ ందని చిరంజీవి పేర్కొన్నారు. తన కుటుంబ సభ్యులను సొంతవారిగా భావించి, తల్లిదండ్రులకు కన్నకూతురిగా మారిపోయిన తీరును ఆయన గుర్తు చేసుకున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.